నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY








సంపుటి : 13 సంచిక : 67 రంగారెడ్డి | శనివారం 04 జులై 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 04-07-2026 | Saturday | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada


### బీఆర్ఎస్ అప్పు అక్షరాలా

# రూ.8.21 లక్షల కోట్లు..

## సమాధానం చెప్పాలని కేసీఆర్‌కు భట్టి సవాల్

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:



తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అప్పుల కుప్పలపై శ్వేతపత్రం తరహాలో సంచలన నిజాలను వెల్లడించారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. (మిగతా 3 లో..)

# రైతన్నలకు గుడ్ న్యూస్..

## 5 ఎకరాల వరకు 'రైతుభరోసా' నిధులు విడుదల

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రజా ప్రభుత్వం తీపి కబురు అందించింది. యాసంగి/వానకాలం పెట్టుబడి సాయానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతుభరోసా' నిధుల విడుదల కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 5 ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లోకి రైతుభరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. (మిగతా 3 లో..)




## పోలీసులతో అరెస్ట్ చేయించేంత పిరికివాళ్లం కాదు: మంత్రి పొన్నం ప్రభాకర్

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:



చర్చకు సై అని.. పోలీసులతో అరెస్ట్ చేయించేంత పిరికివాళ్లం తాము కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గన్ పార్క్ వద్దకు రమ్మని, ఆ తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయలేదని హరీష్ రావు ఆరోపిస్తున్నారన్నారు. గన్ పార్క్ వద్దనున్న గోషా మహల్, మలక్ పేటలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఉంటే.. అక్కడికి వెళ్లామని తెలిపారు. పదే పదే తాము ఫోన్ లిఫ్ట్ చేయలేదంటున్న హరీష్ రావు... ఆయనే రాహుల్ కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేస్తారా? అని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ లు కిందిస్థాయి నుంచి వచ్చిన వ్యక్తులని తెలియదా అని నిలదీశారు. పదేళ్లుగా బీఆర్ఎస్ తో కుమ్మక్కై లాభపడిన చెంచా గాళ్లు వచ్చి.. ఏది చెప్తే అది నమ్మి ఇష్టానుసారం మాట్లాడితే చెల్లదన్నారు. గురుకులాల్లో మొత్తం టెండర్లు రూ.1142 కోట్లు అయితే.. రూ.2 వేల కోట్ల స్కామ్ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. చేతిలో పేపర్లు పట్టుకుని తిరిగినంత మాత్రాన ప్రతిపక్షాల ఆరోపణలు నిజమైపోవన్నారు. విద్యార్థుల భవిష్యత్ బాగుండాలనే గురుకులాలను సెంట్రలైజ్ చేశామని తెలిపారు.

# మూడు షిఫ్టుల్లో పనులు..

## నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: మంత్రి కోమటిరెడ్డి వార్నింగ్

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:



ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బీలోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి, చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో "న భూతో న భవిష్యత్" రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని, అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని, పనులు ప్రారంభించామని మంత్రి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసినా నాణ్యమైన ఆర్ అండ్ బీ డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. (మిగతా 3 లో..)

## భారత వారసత్వ సంపదతో పాక్ చెలగాటం!

అంతర్జాతీయం:




ఐక్యరాజ్యసమితికి చెందిన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ.. పాకిస్తాన్‌కు గట్టి షాక్ ఇచ్చింది. అక్కడ ఉన్న ప్రముఖ పురాతన బౌద్ధ క్షేత్రం, చారిత్రక నగరమైన తక్షశిల ప్రపంచ వారసత్వ హోదాకు సంబంధించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. తక్షశిలలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన 'పునర్నిర్మాణ'

పనులను వెంటనే నిలిపివేసి.. పాత స్థితికి తీసుకురాకపోతే ప్రపంచ వారసత్వ జాబితా నుండి తొలగిస్తామని పాకిస్థాన్ కు ఐరాస లేఖ రాసింది.

పురాతనమైన తక్షశిల ప్రాంతంలో పాకిస్తాన్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కొన్ని మరమ్మతులు,

పునర్నిర్మాణ పనులు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. అంతర్జాతీయ నిబంధనలను పురాతన కట్టడాల పరిరక్షణ సూత్రాలను పక్కనబెట్టి.. ఆధునిక సిమెంట్, ఇటుకలతో ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంపై యునెస్కో నిపుణుల బృందం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పనుల వల్ల కట్టడం.. అసలైన చారిత్రక విలువ, ప్రాచీనత దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

తక్షశిల ఔన్నత్యం దెబ్బతినేలా ఉన్న పునర్నిర్మాణాలను వెంటనే తొలగించాలని..

లేదంటే ప్రపంచ వారసత్వ హోదాను తొలగిస్తామని హెచ్చరించింది. ఇటీవల జర్మనీలోని ఓ ప్రపంచ వారసత్వ ప్రదేశాన్ని తమ జాబితా నుండి యూనెస్కో తొలగించింది.

(మిగతా 3 లో..)

## ప్రభుత్వ దవాఖానాలో ప్రపంచ స్థాయి అద్భుతం..

### ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర్ సన్మానం

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:



భారత్‌లోనే తొలిసారిగా ప్రభుత్వ హాస్పిటల్‌లో ఒకే రోగికి, ఒకేసారి ఐదు అవయవాల (మల్టీ-విసెరల్) మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి దేశ వైద్య చరిత్రలో అరుదైన ఘనత సాధించిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్య బృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ప్లాంట్ బృందానికి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉస్మానియా డాక్టర్లు తెలంగాణతో పాటు, యావత్ దేశానికే గర్వకారణమైన ఘనతను సాధించారని కొనియాడారు. (మిగతా 2లో..)

# దశాబ్దాల కల సాకారం..

## సీమలో ఉక్కు విప్లవం



నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి:

రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. కడప జిల్లా జమ్మల మడుగు మండలం సున్నపురాళ్ల పల్లెలో రూ.16,350 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న జేఎస్ డబ్ల్యూ రాయలసీమ ఉక్కు కర్మాగార పనులను శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న స్టీల్ ప్లాంట్ కల.. కూటమి ప్రభుత్వం వచ్చాక నెరవేరబోతోందని చంద్రబాబు అన్నారు. (మిగతా 3లో..)

# బీజేపీ, బీఆర్ఎస్‌ది 'చీకటి సంసారం'..

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

నిర్భయవార్త ప్రతినిధి : కరీంనగర్:



తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరింది. కరీంనగర్‌లో శుక్రవారం పర్యటించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్, బీజేపీ లక్ష్యంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు.

**బీఆర్ఎస్ అప్పులపై నిలదీత..**

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ప్రజలంతా గమనిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు తాము లెక్కలు చూపిస్తుంటే.. హరీష్ రావు, కేటీఆర్ భరించలేకపోతున్నారని విమర్శించారు. నిజాలను దాచిపెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినందుకే ప్రజలు బీఆర్ఎస్‌ను గద్దె దించారనే విషయాన్ని వారు మర్చిపోవద్దని హితవు పలికారు.

గత ప్రభుత్వం చేయలేని పనులను తాము చేసి చూపిస్తుంటే, ఓర్వలేక ఈర్ష్య పడుతున్నారని మండిపడ్డారు.

**కాళేశ్వరంపై ఘాటు విమర్శలు..**

బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై టీపీసీసీ చీఫ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాళేశ్వరం పేరుతో

ఏకంగా రూ. 1.20 లక్షల కోట్లను బూడిదలో పోసిన పన్నీరు చేశారని విమర్శించారు. నాడు పోలీసుల అండతో బీఆర్ఎస్ నాయకులు ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారో రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలుసన్నారు. (మిగతా 3 లో..)


నిర్భయవార్త
సంపాదకీయం
శనివారం 04 జులై 2026

# ఏకపక్ష వైఖరి?

దేశ వ్యాప్తంగా వ్యక్తమవుతున్న తీవ్ర వ్యతిరేకతను బేఖాతరు చేస్తూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్రామీణ ఉపాధి--ఆజీవికా మిషన్ (విబి గ్రామ్‌జి)ని అమలులోకి తీసుకురావడం కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష, నిరంకుశ వైఖరికి నిదర్శనం. రాష్ట్రాలతో, రాజకీయ పార్టీలతో, కార్మిక సంఘాలతో, పంచాయతీరాజ్ సంస్థలతో ఎటువంటి సంప్రదింపులు లేకుండానే చట్టాన్ని మార్చేసిన కేంద్ర ప్రభుత్వం అమలులో సైతం అటువంటి ఒంటెత్తు పోకడలనే పోతోంది. నిజానికి గ్రామీణ పేదలకు ఉపాధిని చట్టబద్ధ హక్కుగా గుర్తించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం దేశ సామాజిక భద్రతా వ్యవస్థలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచింది. 2005లో అమల్లోకి వచ్చిన ఈ చట్టం కోట్లాది గ్రామీణ కుటుంబాలకు కష్టకాలంలో ఆసరాగా నిలిచింది. కరోనా మహమ్మారి సమయంలోనూ, కరువు, ఆర్థిక మాంద్యం వంటి సంక్షోభాల్లోనూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టింది. అటువంటి చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దానికి భిన్నంగా కక్ష పూరితంగా వ్యవహరిస్తుండటం విచారకరం. నిజానికి పాత ఉపాధి హామీ చట్టం కేవలం ఒక పథకం కాదు. అది పార్లమెంటు ఆమోదించి, దేశ ప్రజలకు ఇచ్చిన ఒక చట్ట బద్ధ హక్కు! తాజా గ్రామ్ జి పథకంతో ఆ హక్కును రద్దుచేసిన కేంద్ర ప్రభుత్వం తిమ్మిని బమ్మి చేసే అవాస్తవ ప్రచారానికి దిగింది. విబి గ్రామ్‌జి ని ప్రతిపక్ష పార్టీలే గాక, ఎన్‌డిఎ, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు సైతం వ్యతిరేకిస్తుండటం గమనార్హం. సమాచార హక్కు చట్టం కింద వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం 13 రాష్ట్రాలు కేంద్రానికి లిఖితపూర్వకంగా అభ్యంతరాలు తెలియజేశాయి. బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు కొత్త పథకం అమలులో భాగంగా తమపై పడనున్న ఆర్థిక భారంపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. పాత చట్టంలో ఉపాధి అమలుకోసం అయ్యే 90 శాతం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించేది. రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం బడ్జెట్‌లో సుమారు పది శాతం సమకూర్చేవి. కానీ, కొత్త పథకంలో 40 శాతం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి వస్తోంది. ఇది అనేక రాష్ట్రాలకు తలకు మించిన భారంగా మారుతోంది. ఒకవైపు బిజెపి పాలిత రాష్ట్రాలే అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. కొత్త పథకం అమలుకోసం కేంద్రం రూపొందించిన నిబంధనలతో నిధుల కేటాయింపుల్లో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం కలుగుతోందన్న ఆందోళనలు వ్యక్తమైనా పీకల్లోతు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అమలుకు సిద్ధమైపోవడం దారుణం. రాష్ట్రంపై పడే ఆర్థికభారం విషయమై కేంద్రాన్ని నిలదీసి, నిధులు సాధించుకోవడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదు. పైపెచ్చు దేశ వ్యాప్తంగా విబి గ్రామ్‌జి అమలు ప్రారంభానికి తిరుపతి జిల్లా మంగంపుట వేదిక కావడం విచారకరం. అధికారంలోని కూటమి నేతలు రాష్ట్ర ప్రయోజనాల కన్నా కేంద్ర పాలకుల అడుగులకు మడుగులొత్తడానికే ప్రాధాన్యత ఇస్తుండగా, ప్రశ్నించి రాష్ట్ర ప్రయోజనాలకు దన్నుగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం కూడా ఆ తానులోని ముక్క మాదిరే వ్యవహరిస్తుండటం గమనార్హం! మరోవైపు దేశ వ్యాప్తంగా వామపక్షాలతో పాటు, వివిధ ప్రతిపక్ష పార్టీలు, వివిధ ప్రజా, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తున్నాయి. 2005 నాటి ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని, అదే సమయంలో పనిదినాలను పెంచాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కేంద్రం తన వైఖరిని మార్చుకోవడానికి సిద్ధంకాలేదు. వ్యవసాయ చట్టాలు, విద్యా విధానం, క్రిమినల్ చట్టాలు, ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ కేంద్రం ఏకపక్ష వైఖరినే అనుసరిస్తోంది. ప్రజాస్వామ్యంలో చట్టబద్ధ హక్కులను పాలకుల ఇష్టానుసారం మార్చలేరు. విస్తృత చర్చ, సంప్రదింపులు, రాష్ట్రాల అంగీకారంతోనే ప్రజాస్వామ్య రథం ముందుకుసాగుతుంది. దేశ వ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా కేంద్రం మొండి వైఖరిని వీడాలి. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, మరింత బలోపేతం చేయాలి. తగిన నిధులు కేటాయించడం, వేతన బకాయిలు వెంటనే చెల్లించడం, పనిదినాలను అవసరానికి అనుగుణంగా పెంచడం, గ్రామసభల అధికారాలను పటిష్టం చేయడం ద్వారా మాత్రమే గ్రామీణ భారతానికి భరోసా లభిస్తుంది.

# నైతికతకు మతం సరిపోదా?

మానవజీవితంలో మతం పాత్ర గురించి ఘనంగా చెప్పి రాజకీయాలను దాని చుట్టూ తిప్పేవారికి సవాళ్లు బయటి నుంచి కంటే లోపల నుంచే ఎక్కువగా వస్తాయి. అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగ వ్యవహారమే ఇందుకు నిదర్శనం. దేశ రాజకీయాలను మత ఆలోచనలతో విపరీతంగా ప్రభావితం చేసిన రామాలయ ఉద్యమం చివరికి అవినీతిలో ఇంతగా చిక్కుకుపోతుందని ఎవరూ ఊహించలేదు. దశాబ్దాల ఆందోళనలు, వివాదాల అనంతరం సుప్రీంకోర్టు తీర్పుతో ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైన తర్వాత కేంద్ర ప్రభుత్వం అవినీతికి ఆస్కారం లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేస్తుందని భక్తకోటి విశ్వసించింది. వందల వేలకోట్ల ఆదాయం వచ్చే ఆలయాల నిర్వహణపై కట్టుదిట్టమైన చట్టపరమైన ఏర్పాట్లు లేకపోతే పరిస్థితి ఏమవుతుందనటానికి రామాలయ వ్యవహారానికి మించిన ఉదాహరణ మరొకటి ఉండదు. ఆలయాలపై ప్రభుత్వాల పర్యవేక్షణ ఉండకూడదని వాదించే వారికి ఇప్పుడు ఎటూ పాలుపోవటం లేదు. రామాలయ నిధుల దుర్వినియోగంపై కొన్ని నెలలకైనా ఏదోవిధంగా దర్యాప్తు పూర్తి అవుతుంది. దోషులుగా తేలిన వారికి ఏదోరకమైన శిక్షలూ పడతాయి. అంతటితో ఈ సమస్య ముగిసిపోతుంది. కేంద్రంతో పాటు యూపీ ప్రభుత్వం కూడా చట్టపరంగా చేయగలిగినదంతా చేసి నైతిక ధర్మాన్ని నిలబెట్టామని గొప్పగా చెప్పుకోవచ్చు. కానీ నైతికధర్మం, నైతిక ప్రవర్తనలో మనం చాలా దిగజారిపోతున్నామని గుర్తించటానికి రామాలయ నిధుల దుర్వినియోగం ఒక సందర్భాన్ని సమకూర్చుతోంది. మతంతోనే మానవజీవితంలో నైతికత పుట్టలేదు. మనుషులు మనుగడకోసమే నైతిక నియమాలను ఏర్పరచుకున్నారు. రాతకోతలు తెలియని, మతగ్రంథాల్లేని వేల ఏళ్ల నాటి ఆదిమసమాజాల్లో కూడా మంచిచెడులను నిర్దేశించే నైతిక నియమాలు ఉన్నాయి. మతాలు పుట్టి వ్యవస్థీకృతం అయిన తర్వాత నైతిక నియమాలను దేవుళ్లే నిర్దేశించారనీ, వాటిని ఉల్లంఘించే వారిని ఇహలోకంలోనూ పరలోకంలోనూ కఠినంగా శిక్షిస్తారనే భావాలకు చాలా ప్రాధాన్యం వచ్చింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని హిందూమతం అవిచ్ఛిన్నంగా బలంగా కొనసాగుతోందని మనం ఎంతైనా చెప్పుకోవచ్చు. కానీ అది నైతికతనూ, చట్టబద్ధ నడవడినీ ప్రజల్లో నెలకొల్పేవిధంగా ప్రేరేపిస్తోందా? అంటే గట్టిగా చెప్పలేం. మతనమ్మకాలనూ విధులనూ నిష్ఠగా ఆచరించటానికీ రోజువారీ జీవితంలో నైతికప్రవర్తనకూ మధ్య లంకె కుదరటం లేదు. 1982లో ప్రముఖ రచయిత, చరిత్రకారుడు, పాత్రికేయుడైన కుష్వంత్ సింగ్ 'ఉయ్ ఇండియన్స్' అనే పుస్తకాన్ని రాశారు. అప్పటికే ఆయన మతానికీ నైతిక ప్రవర్తనకూ మధ్య సంబంధం ఎంత బలహీనంగా మారిపోయిందో స్పష్టంగా తెలిపారు. మతానికి కేంద్రంగా ఉండాల్సిన నైతికత ఆచరణలో తొలగిపోయిందనీ దాని స్థానంలో వట్టి ఆచారాలు, సంప్రదాయాలు మాత్రమే మిగిలిపోయాయనీ వ్యాఖ్యానించారు. కులవ్యవస్థలో ప్రజలు ఒదిగి ఉండటానికి, గోసంరక్షణలాంటి విషయాలకు ప్రాధాన్యం ఇవ్వటానికి మాత్రమే మతం పరిమితం అయిపోతోందనీ విమర్శించారు. పూజలు చేయటం, దేవాలయాలకు వెళ్లటం, ఉపవాసాలు పాటించటం, తీర్థయాత్రలకు తరలిపోవటం, శుభముహూర్తాలను ఆచరించటం కంటే నైతికవర్తనకు ఎక్కువగా మతం దోహదం చేయాలనీ, కానీ అదెక్కడా కనపడటం లేదని ఘాటుగా విమర్శించారు. మతానికీ నైతికతకూ ఉండాల్సిన సంబంధం గురించి కుష్వంత్‌సింగ్ ఒక్కరే చెప్పలేదు. ఆధునిక సామాజికశాస్త్రానికి ఆద్యుడుగా భావించే మాక్స్‌వెబర్ కూడా నైతికతకూ సమాజ అభివృద్ధికి మధ్య సంబంధాన్ని విశ్లేషించారు. శ్రామిక వృత్తులను పవిత్రమైనవిగా భావించటంతో పాటు కష్టపడి పనిచేయటాన్ని దేవుడికి సేవ చేసినట్లుగా పరిగణించటం, సమయపాలన, పొదుపు, ఒప్పందాలను గౌరవించటం లాంటివి ప్రొటెస్టంట్ మతంలో ప్రధాన నైతిక అంశాలుగా ఉన్నాయనీ, అవే పాశ్చాత్య దేశాల అభివృద్ధికి చోదకశక్తులుగా పనిచేశాయనీ వెబర్ సూత్రీకరించారు. దీంతో అందరూ ఏకీభవించకపోవచ్చు. కొన్ని ఆసియా దేశాల్లో కూడా ఇవి ఉన్నాయనీ వాదించొచ్చు. కానీ వృత్తులను తక్కువగా చూడటం, శ్రమచేసే వారిని హీనంగా పరిగణించటం మన సమాజంలో ఇప్పటికీ ఉంది. ఇదెంతగా గతంలో మన అభివృద్ధిని కుంగదీసిందో లోతుగా పరిశోధిస్తే గానీ పూర్తి నిజాలు తెలియవు. రాజ్యవంశాల ఘనతలను చెప్పుకోవటానికీ, ప్రజాస్వామ్యం మొదలుకుని అన్నిటికి మనమే ఆద్యులమని ప్రకటనలు చేయటానికీ చరిత్ర రచనను పరిమితం చేయాలని మనం గట్టిగా ప్రయత్నిస్తున్నాం. పాఠ్యపుస్తకాలను అటువంటి చరిత్రతో నింపటానికే కసరత్తులు జరుగుతున్నాయి. తమ శ్రమతో, నైపుణ్యంతో సమాజం నడవటానికి కారణమైన వారికంటే పైవర్గాలకు పెద్దపీటవేసి వాళ్లకే విగ్రహపూజలు చేయటం మనకు అలవాటు. అదిప్పుడు ఇంకా ఎక్కువవుతోంది. అనైతిక ప్రవర్తనలను కట్టడిచేసే పదునును మతం కోల్పోతున్న దృశ్యం మనకు అడుగడుగునా కనపడుతుంది. ప్రతి పాపానికీ పరిహారం ఉంటుందనే ఆలోచన నైతికతను నిలదొక్కుకోనీయదు. ఘోరాలనూ నేరాలనూ రకరకాల ప్రాయశ్చిత్తాలతో కడిగేసుకుందామనే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. అందుకే మనం అవినీతిని తగ్గించలేక పోతున్నాం. మన చట్టాలు ఘనంగా ఉంటాయి. హీనంగా అమలవుతాయి. ప్రపంచ దేశాల్లోని అవినీతిని అంచనా వేసే 'ట్రాన్సపరన్సీ ఇంటర్‌నేషనల్' అంచనాల ప్రకారం మన దేశంలో నైతికత ఏ మాత్రం మెరుగవ్వటం లేదు. 2016లో భారత్ ర్యాంకు 79 ఉంటే 2025 నాటికి అది 91కి పెరిగింది.





ఓటర్లకు డబ్బులను పంచటంలో మనం ఎవ్వరికీ అందనంత స్థాయిలోకి వెళ్లిపోతున్నాం. ఎన్నికలప్పుడు ఒక్కో కుటుంబానికి వేల రూపాయలు చెల్లించటం దక్షిణాది రాష్ట్రాల్లో సర్వసాధారణమైంది. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో లక్ష నుంచి లక్షా ముప్పయి అయిదు వేల కోట్ల రూపాయలను ఖర్చుపెట్టినట్లు అంచనాలు ఉన్నాయి. ఇందులో అధికారికంగా, చట్టబద్ధంగా ఖర్చుపెట్టింది 10శాతం లోపుగానే ఉంటుంది. మిగతాదంతా అనైతికంగా ఖర్చుపెట్టిందే. ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ ఇంతగా ఎన్నికలపై అక్రమ ధనప్రభావం లేదు. అవినీతి సర్వవ్యాప్తం అవ్వటంతో అక్కడక్కడా నీతిగా వ్యవహరించే ఉద్యోగులనూ, పద్ధతి ప్రకారం పన్నులుకట్టే వ్యాపారులనూ, పారిశ్రామికవేత్తలనూ అనుమాన దృష్టితో చూడటమే కాదు.. వాళ్లను అబద్ధాలకోరులుగా భావించటమూ జరుగుతోంది. నిజాయితీగా వ్యవహరించేవారు.. మేం అలా ఉన్నామని.. అవసరార్థం ఎక్కడైనా చెప్పుకోవటం కూడా ఇబ్బందిగా మారటం కంటే దురవస్థ మరొకటి ఉండదు. ట్రాన్సపరన్సీ ఇంటర్‌నేషనల్ లాంటివి పరిమిత సమాచారంతోనే అవినీతిపై ర్యాంకులు ఇస్తున్నాయి. అన్ని రంగాల్లో అవినీతినీ దానివల్ల పోగుపడిన నల్లధనాన్నీ అంచనా కట్టటం కూడా అంత తేలికగా వీలుకావటం లేదు. 2016లో ఆర్భాటంగా చేసిన నోట్ల రద్దు అవినీతిపై ఎలాంటి ప్రభావం చూపించలేదు. ఆర్థికవ్యవస్థను ఒడుదుడుకులకు గురిచేసి ప్రజలను ఇబ్బందుల పాలుచేయటం కంటే సాధించింది ఏమీ లేదు. 1985 నాటికే దేశంలో నల్లధనం జీడీపీ (దేశీయ స్థూల ఉత్పత్తి)లో 15 నుంచి 21శాతానికి సమానంగా ఉంటుందని అంచనాలు వచ్చాయి. 2000 నాటికి అది 23 నుంచి 26శాతానికి చేరుకుంది. ప్రముఖ ఆర్థికవేత్త అరుణ్‌కుమార్ అంచనాల ప్రకారం 2012--13 నాటికి అది జీడీపీలో 62శాతానికి సమానంగా ఉంది. అప్పుడు జీడీపీ రూ.93 లక్షల కోట్ల రూపాయలు. అంటే 57 లక్షల కోట్లు నల్లధనం రూపంలో ఉంది. 2025--26లో మన జీడీపీ రూ.323 లక్షల కోట్లు. అరుణ్‌కుమార్ అంచనాల ప్రకారం నల్లధనాన్ని లెక్కకడితే అది రూ.200 లక్షల కోట్లు అవుతుంది. నల్లధనం అంటే డబ్బురూపంలో ఉండేదే కాదు. నిజానికి డబ్బురూపంలో ఉండేది చాలా తక్కువ. భూములు, బంగారం, బినామీ ఆస్తులు, షెల్‌కంపెనీలు, విదేశాల్లోని ఆస్తులు లాంటి ఎన్నోరూపాల్లో అది ఉంటుంది. మతం నైతిక ప్రవర్తనకు తోడ్పడకపోతే జరిగే అనర్థం అంతా ఇంతాకాదు. సమాజంలో లౌకిక, హేతువాద, ఆధునికతత్వ భావాలున్నా, వాటి ఆధారంగా నైతిక ప్రవర్తనతో వ్యవహరించే వారి సంఖ్య చాలా స్వల్పం. మతనమ్మకాలే అత్యధికులను ప్రభావితం చేస్తున్నాయి. ఆ నమ్మకాల్లో నుంచి వచ్చే పాపపుణ్యాల వివేచనా, ధర్మాధర్మ విచక్షణ.. మన నైతికతను బలోపేతం చేయలేకపోతే ఆలయాలు, మసీదులు, చర్చిలు అవినీతికి ఆలవాలంగా మారిపోతాయి. అయోధ్య రామాలయంలో నిధులను మింగేసిన వారికి దైవభక్తి నిండుగా ఉన్నా పాపపుణ్యాలనూ నైతికతనూ వదిలేశారు. ఇప్పటి ప్రభుత్వాలు పోటీలుపడి గుడులు, గోశాల అభివృద్ధికి నిధులు ఖర్చుపెడుతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ నిధులను మతకార్యక్రమాలకు వాడాలంటే ఒక బెదురు ఉండేది. ఇప్పుడదేమీ లేదు. పన్నుల నుంచి వచ్చే ఆదాయం నుంచి వందల కోట్లను అలవోకగా ఖర్చుపెట్టేస్తున్నారు. ఇతర మతాల వారూ మాకూ అలా భారీగా నిధులు కేటాయించాలని కోరితే ఏంచేస్తారో తెలియదు. అసలు లౌకిక రాజ్యాంగపాలనలో ఇలా ఖర్చుపెట్టటం సబబా? కాదా? అన్న ఆలోచన చేయటాన్నే పాలకులు మర్చిపోతున్నారు. కోర్టులూ వాటిని పట్టించుకోవటం లేదు. ఒకప్పుడు రాజులు, నవాబులు తాము తలచినదే తడవుగా ఆలయాలు, మసీదుల నిర్మాణాలకు పూనుకొనేవారు. ప్రజాస్వామ్యంలోనూ మళ్లీ ఆ పోకడలు కనపడుతున్నాయి. ధర్మార్థకామమోక్షాలను సమతూకంలో పాటించటం అనేది హిందూమతసారంగా చెప్పటాన్ని చాలా తరచుగా మనం వింటాం. అర్థం (ధనార్జన) కోసం నైతిక ధర్మాన్ని వదలివేయటం ఇప్పుడు తేలికగా జరిగిపోతోంది. నైతికతను పెంచే రీతిలో మతం ఎందుకు వ్యవహరించలేకపోతోందని ప్రశ్న వేసుకుని విరుగుడు చర్యలకు ఉపక్రమించకపోతే నష్టం చాలా ఎక్కువగా ఉంటుంది. అన్ని మతాల్లో మంచిని పెంచేవీ తుంచేవీ రెండూ ఉంటాయి. నైతిక ప్రవర్తనకు దోహదం చేయని వాటిని వదలివేయలేని అశక్తత చివరికి సమాజాన్ని కుంగదీస్తుంది. ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుంది. మతం మహోన్నత శక్తిగా కొనసాగాలనుకునేవారు ఈ దిశగా ఆలోచించటం కనీస కర్తవ్యంగా పరిగణించాలి. నైతికతను పెంపొందించనిది అది మతమైనా, మరోతత్వమైనా ఎప్పటికీ మహోన్నతమైంది కాదు. మత ఉద్రేకాలతో ఓట్లను పొందటం తేలికే కావచ్చు. ఒక మత వర్గంపై ద్వేషం ఆత్మానందాన్ని ఇవ్వొచ్చు. కానీ నైతికతను పెంచేరీతిలో మతాన్ని మలచటమే అసలుసిసలైన సవాల్. ఆ శక్తి ఇప్పటి మతంలో లేకపోతే నైతికతను పెంచే కొత్త భావాలనైనా ఆహ్వానించాలి. మధ్యేమార్గం ఉందని అనుకోలేం! విశ్వాసాల పాటింపులో నిష్ఠత--నైతికవర్తనలో అనిష్ఠతను మించిన ప్రమాదం మరొకటి లేదు! ద్వంద్వ ప్రమాణాలతో విశ్వగురు పీఠాన్ని పొందలేం!

**రాహుల్ కుమార్**

# నాడు విధ్వంసం... నేడు నాటకం!

అమరావతి నిర్మాణాన్ని అడ్డుకొని మరణశాసనం రాసినవారు నేడు 'పరిరక్షణ' పేరుతో ప్రదర్శనలు చేసినంత మాత్రాన వారి పాపాలు పరిహారం అవుతాయా? రాజధాని... రాష్ట్ర భవిష్యత్తుకు పునాది, కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతీక, వేలాది మంది రైతుల త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం. అలాంటి అమరావతిని స్వార్థ రాజకీయ కోసం విధ్వంసం చేసి ఇప్పుడు పరిరక్షణ పేరుతో మొసలి కన్నీరు కార్చడం ప్రజలను మోసం చేసే మరో ప్రయత్నమే. రాజధాని విధ్వంసం రైతుల విశ్వాసంపై, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై, ప్రజల ఆకాంక్షలపై, రాష్ట్ర ప్రతిష్ఠపై జరిగిన దాడి. ఇవన్నీ పరిరక్షణ నాటకాలతో ప్రాయశ్చిత్తం అయ్యేవి కావు. అమరావతిని విధ్వంసం చేసినవారు, ఇప్పుడు దాని అభివృద్ధిని చూసి ఓర్వలేకనో, లేక రాజకీయంగా మనుగడ సాగించడానికో మాట్లాడుతున్న మాటలు. వాటిని ప్రజలు గుర్తించలేరని అనుకోవడం వారి భ్రమే. ఐదేళ్లపాటు అమరావతిని నిర్వీర్యం చేసి, ఇప్పుడు 'మావిగన్' అంటూ కొత్త పాట అందుకొన్న జగన్, అమరావతి రైతుల పరిరక్షణ కమిటీ పేరిట రాజధాని రైతుల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు మొదలుపెట్టారు. అమరావతికి ప్రత్యామ్నాయంగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ 'మావిగన్' ఏర్పాటు చేయాలని ఉచిత సలహా ఇచ్చిన జగన్. అకస్మాత్తుగా తన పార్టీ నేతలను అమరావతిపై దండయాత్రకు పంపారు. అమరావతి వల్ల రాష్ట్రానికి ప్రయోజనం లేదని, 2029లో అధికారంలోకి వచ్చిన వెంటనే మావిగన్‌ను జగన్ రాజధానిగా ప్రకటిస్తారని చెబుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు 'పరిరక్షణ' పేరుతో అమరావతికి వెళ్లడంతో రైతులు తిరగబడ్డారు.



అమరావతిని నానా విధాలా తూలనాడి రాజధాని నిర్మాణానికి రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు అడ్డుపడ్డారు. రివర్స్ టెండరింగ్ పేరుతో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం పరువు తీసారు. రాజధాని ఉద్యమంలో మహిళా రైతులను రాయలేని విధంగా దుర్భాషలాడారు. 1631 రోజులు రాజధానిగా అమరావతినే కొనసాగించాలని రైతులు, మహిళలు రాత్రి పగలు ఆందోళన చేసినా పట్టించుకోలేదు. రైతుల పాదయాత్రను అడ్డుకొన్నారు. ఇటువంటి మహాపాపులు అమరావతి పరిరక్షణ పన్నాగంతో ఇప్పుడు రైతులపై ప్రేమ ఒలకబోస్తున్నారు. ఎవరు అమరావతి నిర్మాణం మొదలుపెట్టారో, అభివృద్ధి చేస్తున్నారో, ఎవరు విధ్వంసం చేశారో, ఎవరు ఇప్పుడు కపట నాటకాలు ఆడుతున్నారో ప్రజలకు బాగా తెలుసు.

**నీరుకొండ ప్రసాద్**

## ప్రభుత్వ దవాఖానాలో ప్రపంచ స్థాయి అద్భుతం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సల్లో ఒకటిగా భావించే మల్టీ-విసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను విజయవంతంగా నిర్వహించడం అసాధారణ విజయమన్నారు. డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని ట్రాన్స్‌ప్లాంట్ బృందం 36 గంటల పాటు శ్రమించి ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం అసాధారణ విజయమని కొనియాడారు. ఈ చారిత్రాత్మక విజయానికి కృషి చేసిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, అనస్థీషియా నిపుణులు, గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, క్రిటికల్ కేర్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లు, ఇతర సిబ్బంది అందరికీ మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే, అవయవదానం ద్వారా మరో ప్రాణానికి జీవం పోసిన అవయవదాత కుటుంబ సభ్యుల సేవాభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ, "అవయవదానం.. మహాదానం" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ సమాజంలో విస్తృతంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

**కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా, పోటీగా..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా, పోటీగా వైద్య సేవలు అందించే విధంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేశామని, తాజాగా మరో 6238 పోస్టులను మంజూరు చేశామని మంత్రి గుర్తు చేశారు. పాత భవనాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక ఎక్విప్‌మెంట్, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే ప్రజలకు అన్నిరకాల మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొస్తున్నారని మంత్రి ప్రశంసించారు.

## బీఆర్ఎస్ అప్పు అక్షరాలా రూ.8.21 లక్షల కోట్లు..

(మొదటి పేజీ తరువాయి)

**అబద్ధాల పునాదులపై పదేళ్ల పరిపాలన..**

"హరీశ్ రావు గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేశాననే విషయం మరిచిపోయి మాట్లాడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు అబద్ధాల పునాదులపైనే పరిపాలన సాగించింది" అని భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన మొత్తం అప్పు అక్షరాలా రూ. 8.21 లక్షల కోట్లు అనీ, ఇందులోనే గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలి వెళ్లిన వేల కోట్ల బకాయిలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ భారీ అప్పులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.

**వడ్డీల భారమే రూ.2 లక్షల కోట్లు..**

గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రస్తుత ప్రభుత్వంపై పడుతున్న భారాన్ని భట్టి వివరించారు. బీఆర్ఎస్ తెచ్చిన అప్పులకు గానూ.. గడిచిన రెండున్నరేళ్లలోనే తాము అసలు, వడ్డీలు కలిపి రూ. 2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. ఇంతటి భారీ అప్పులు కడుతూ కూడా, ప్రజా ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయకుండా సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను ప్రస్తుతం తాము రీస్ట్రక్చరింగ్ చేయిస్తున్నామని.. దీనివల్ల ఏడాదికి కట్టాల్సిన వడ్డీ భారాన్ని రూ. 34 వేల కోట్ల నుంచి రూ. 11 వేల కోట్లకు తగ్గించగలిగామని వివరించారు. కేసీఆర్, హరీశ్ రావులకు గతం లేదు.. భవిష్యత్ లేదు. అందుకే ఉనికి చాటుకోవడానికి ఇప్పుడు హడావిడి పెంచారు" అని ఎద్దేవా చేశారు.

**బొగ్గు మాయంపై విజిలెన్స్ విచారణ..**

సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. "బీఆర్ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. పదేళ్ల కాలంలో సింగరేణిలో కనీసం ఒక్క కొత్త బ్లాక్‌నైనా అందుబాటులోకి తెచ్చారా? ఇన్నాళ్లూ కొత్త బ్లాక్లు రాకుండా అడ్డుకున్నదే బిఆర్ఎస్ నేతలు" అని దుయ్యబట్టారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే.. గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌కు పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. కొత్త కోల్ బ్లాక్లను సాధించుకునేందుకు ప్రస్తుతం తాము కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని, సింగరేణిని కాపాడుకుంటూనే కార్మికుల ప్రయోజనాలను రక్షిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

# మూడు షిఫ్టుల్లో పనులు..

(మొదటి పేజీ తరువాయి)

"మంచి రోడ్డు – ప్రగతికి సూచిక" అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. మొదటి ఫేజ్‌లో సుమారు 13 వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా.. ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు రూ. 155 కోట్ల అంచనా వ్యయంతో 42 కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్‌నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని, అయినా.. వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో(రాత్రి వేళల్లో కూడా) రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులైన, నిరంతరం ఫీల్డ్‌లో ఉండే ఇంజినీర్లను ఎంపిక చేసి, ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజినీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, జ=ఖీ రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని అధికారులకు మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు.

**2027 డిసెంబర్‌లో కొత్త హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రారంభం..**

రాజేంద్రనగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవనం, జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16% పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించగా.. మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని, అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బీ తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజినీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని, ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఈ ప్రాజెక్టుల్లో మనసుపెట్టి పనిచేసే ఇంజినీర్లను పెట్టండి..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి, మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజినీర్లను నియమించాలని మంత్రి సూచించారు. ఈ వారం నుండే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక సైట్ విజిట్స్ చేస్తానని.. పనుల పురోగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని, కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర, భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి, గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బీ ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు. సంబంధిత ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బీ తరుపున నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సీ జయ భారతి, అన్ని విభాగాల సీఈలు బీవీ రావు, రాజేశ్వర్ రెడ్డి, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, వనజ, రాజేందర్, నర్సింగ్ రావు పలువురు ఆర్ అండ్ బీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్‌ది 'చీకటి సంసారం'..

(మొదటి పేజీ తరువాయి)

**బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే!..**

మరోవైపు బీజేపీ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యలకూ మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని బండి సంజయ్ అనడం హాస్యాస్పదమన్నారు. అసలు నిజం ఏంటంటే.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలే లోపాయికారీ ఒప్పందంతో ఒకటయ్యాయని, ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. దేశంలో అదానీ, అంబానీలను తప్ప బీజేపీ ప్రభుత్వం మరెవరినీ అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. దేవుడి పేరు చెప్పి ప్రజలను మోసం చేయవద్దని, జనం ఇప్పుడు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. తమ జాతీయ అధ్యక్షుడు వస్తే కనీసం 2000 మందిని కూడా సమీకరించుకోలేని సభలు నిర్వహిస్తున్న బీజేపీ.. కాంగ్రెస్ గురించి మాట్లాడటం సరికాదన్నారు.

**పార్టీ అంతర్గత విషయాలు, క్యాబినెట్ విస్తరణ**

కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువని, ఎవరైనా పరిధి దాటితే వెంటనే సస్పెండ్ చేయడమో, డిస్మిస్ చేయడమో పరిష్కారం కాదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలుంటే అందరం కూర్చొని చర్చించుకుంటామని, కలిసి ముందుకు సాగుతామని చెప్పారు. యాదగిరిగుట్ట బోర్డు ఏర్పాటు విషయంలో స్థానిక నాయకులను సంప్రదించి ఉంటే బాగుండేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక మంత్రివర్గ విస్తరణపై స్పందిస్తూ.. క్యాబినెట్‌లో కేవలం రెండు ఖాళీలు (అవకాశాలు) మాత్రమే ఉన్నాయని, దీనిపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## లోయలో పడ్డ బస్సు.. స్పాట్‌లో 40 మంది మృతి!

అంతర్జాతీయం:



పాకిస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వేగంగా వెళ్తున్న ఒక బస్సు నియంత్రణ కోల్పోయి పర్వత ప్రాంతం నుంచి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో దాదాపు 40 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు మహిళలు, చిన్నారులు ఉన్నట్లు సమాచారం. బలూచిస్థాన్‌లోని షేరానీ జిల్లా ధనాసర్ ప్రాంతం మీదుగా ఖైబర్ పఖ్తుంఖ్వా వైపు వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. క్వెట్టా నుంచి పెషావర్ నగరానికి బయలుదేరిన ఈ బస్సులో ప్రమాద సమయంలో మొత్తం 48 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు.

**ప్రమాదానికి అసలు కారణం ఇదే..**

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ బస్సు మొదట క్వెట్టా నుంచి 36 మంది ప్రయాణికులతోనే బయలుదేరింది. అయితే, మార్గమధ్యంలో మరో బస్సు పాడైపోవడంతో, ఆ వాహనంలోని ప్రయాణికులను కూడా ఇదే బస్సులోకి ఎక్కించుకున్నారు. దీనివల్ల బస్సులో సామర్థ్యానికి మించి ప్రయాణికుల రద్దీ పెరిగిపోయింది. దీనికి తోడు డ్రైవర్ మితిమీరిన వేగంతో వాహనాన్ని నడపడంతో, ఘాట్ రోడ్డులోని మలుపుల వద్ద బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. ఫలితంగా భారీ వాహనం పర్వతం పైనుంచి ఒక్కసారిగా కింద ఉన్న లోయలోకి పడిపోయిందని షేరానీ డిప్యూటీ కమిషనర్ వలీ ఖాన్ కాకర్ వెల్లడించారు.

**తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు..**

ఈ ఘోర ప్రమాదంపై బలూచిస్తాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు, స్థానిక జిల్లా యంత్రాంగం వెంటనే ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని వెలికితీసి చికిత్స నిమిత్తం ఝోబ్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి కూడా అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించిన అధికారులు, ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు.

## భారత వారసత్వ సంపదతో పాక్ చెలగాటం!

(మొదటి పేజీ తరువాయి)

అక్కడి ప్రభుత్వం అనవసరమైన జోక్యాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. అలాగే పాక్ తక్షశిల విషయంలోనూ ఏమాత్రం వెనుకాడబోమని.. యూనెస్కో అధికారులు తాజాగా రాసిన లేఖలో తేల్చి చెప్పినట్లు ఆ దేశ ప్రముఖ పత్రిక డాన్ ఓ కథనాన్ని ప్రచురించింది. కాబట్టి అలాంటి పరిస్థితి తెచ్చుకోకుండా పాక్.. పునర్నిర్మాణాలను తొలగిస్తుందని ఆశిస్తున్నట్లు యూనిస్కో వర్గాలు పేర్కొన్నట్లు రాసుకొచ్చింది. పాకిస్థాన్‌లోని రావల్పిండి జిల్లాలో ఉన్న తక్షశిల క్రీస్తు పూర్వం నుంచి ఎంతో విశిష్టతను కలిగి ఉంది. ఒకప్పుడు ప్రపంచ ప్రసిద్ధ విద్యా కేంద్రంగా, బౌద్ధ సంస్కృతికి నిలయంగా విలసిల్లింది. ఒకప్పటి అఖండ భారత దేశంలో తక్షశిల ఓ వెలుగు వెలిగింది. అయితే దేశ విభజన తర్వాత తక్షశిల ప్రాంతం పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లిపోయింది. అయితే 1980లోనే దీనికి ప్రపంచ వారసత్వ హోదాను ఇచ్చి యూనెస్కో గౌరవించింది. అయితే సరైన ప్రణాళిక లేకుండా నిపుణుల పర్యవేక్షణ లేకుండా స్థానిక అధికారులు చేసిన మార్పులు ఈ చారిత్రక సంపదను కలుషితం చేసేలా ఉన్నాయని ఐరాస నివేదిక పేర్కొంది. 'పురాతన కట్టడాలను సంరక్షించాలి కానీ, వాటి రూపరేఖలను మార్చేలా కొత్తగా నిర్మించకూడదు' తాజాగా పాక్ ను హెచ్చరించింది.

# రైతన్నలకు గుడ్ న్యూస్..

(మొదటి పేజీ తరువాయి)

**నాలుగో రోజుకు చేరిన నిధుల పంపిణీ..**




రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమం వరుసగా నాలుగో రోజుకు చేరింది. తక్కువ భూమి ఉన్న రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, విడతల వారీగా అకౌంట్లలో డబ్బులు జమ చేసే ప్రక్రియను వ్యవసాయ, ఆర్థిక శాఖలు ముమ్మరం చేశాయి. మొదటి రోజు ఒకటి, రెండు ఎకరాల లోపు ఉన్న రైతులతో ప్రారంభమైన ఈ ప్రక్రియ.. నిరంతరాయంగా సాగుతూ శుక్రవారం 5 ఎకరాల పరిమితి వరకు ఉన్న రైతులందరికీ వర్తింపజేశారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకే నగదు జమ అవుతుండటంతో రైతుల మొబైల్‌కు మెసేజ్‌లు వచ్చాయి.

**సకాలంలో పెట్టుబడి సాయం..**

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తరుణంలో, సకాలంలో పెట్టుబడి సాయం అందడంపై రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో లాగా కాకుండా, ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా. నేరుగా తమ అకౌంట్లలోకే డబ్బులు రావడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం.. ఇచ్చిన మాట ప్రకారం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, మిగిలిన రైతులకు కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా రాబోయే రోజుల్లో నిధులు జమ అయ్యేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

## దశాబ్దాల కల సాకారం..

(మొదటి పేజీ తరువాయి)

స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభంతో రాయలసీమలో నవశకం మొదలైందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అవమానాలు దాటుకుని పనులు ప్రారంభించుకోవడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేసి.. ఇక్కడి ప్రజలను మోసం చేశారని చంద్రబాబు అన్నారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. గడచిన రెండేళ్లలో చాలా అంశాల్ని పరిష్కరించి ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టామని స్పష్టం చేశారు. 1,100 ఎకరాల్లో రూ. 16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం పేర్కొన్నారు. మొదటి దశలో రూ. 4 వేల కోట్లు, రెండో దశలో రూ. 11,850 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు తెలియజేశారు. స్టీల్ ప్లాంట్ తో పాటు సోలార్ ఎనర్జీ క్యాప్టివ్ ప్లాంట్ ను సైతం జేఎస్ డబ్ల్యూ ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం తెలిపారు. రాయలసీమకు ఎవరివల్ల నష్టం జరిగిందో ఇక్కడి ప్రజలు ఒకసారి ఆలోచన చేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు సూచించారు. జేఎస్ డబ్ల్యూ ప్లాంట్ తో ఈ ప్రాంతం.. సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు గతంలో తన పాలనలో ఏర్పాటైన కియా ప్లాంట్ గురించి చంద్రబాబు ప్రస్తావించారు. కియా కార్ల పరిశ్రమతో అనంతపురం దశాదిశ మారిందన్నారు. కొందరు స్వార్థపరులు గతంలో కేవలం సొంత ప్రయోజనాల కోసమే పనిచేసి అక్రమాలు చేశారని ఈ సందర్భంగా చంద్రబాబు దుయ్యబట్టారు. ఓబులాపురం గనుల పేరు చెప్పి దోపిడీ చేశారన్నారు. స్మగ్లింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేశారని ఆరోపించారు. రాయలసీమకు చెందిన సంపద ఈ ప్రాంతంలోనే ఉపయోగపడాలని చంద్రబాబు అన్నారు. ఇక్కడి ముడి ఇనుముతో ఇక్కడే ఉక్కు తయారు అవ్వాలని పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే ప్లాంట్లతో స్థానికంగానే ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. వచ్చే రెండేళ్లలోనే ఈ పరిశ్రమలో ఉత్పత్తి కూడా ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. మరోవైపు రూ. 11 లక్షల కోట్ల పెట్టుబడులు ఇప్పటికే రాష్ట్రానికి వచ్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. 9 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన యువత మరెక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మరోవైపు ప్రతిపక్ష వైసీపీ పై చంద్రబాబు ఈ సందర్భంగా విరుచుకుపడ్డారు. విధ్వంసమే గొడ్డలి పార్టీకి అజెండా అంటూ విమర్శించారు. వారికి విశ్వసనీయతే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిన్న మావిగన్ అన్నారు. నేడు విజయవాడ అంటున్నారు. మతిస్థిమితం లేని వ్యక్తులు రాజకీయం చేస్తున్నారు. నమ్మకంతో, విశ్వాసంతో పాలన అందిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని చెబుతున్నా. గత పాలనలో మన రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి. ప్రజలంతా గర్వపడే విధంగా కాలరెత్తుకుని చెప్పే విధంగా అమరావతిని అభివృద్ధి చేస్తాం' అంటూ చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి..జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.

## వనమహోత్సవ భారీ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే.



ఖమ్మం/సత్తుపల్లి, జూలై 03 నిర్భయవార్త రిపోర్టర్. భావితరాల సంక్షేమం కోసం, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి మొక్కలను పెద్ద ఎత్తున నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. శుక్రవారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో విద్యార్థులు, యువత, ప్రజలతో జేవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వనమహోత్సవ సభలో నిర్వహించిన కార్యమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి ప్రారంభించారు. ముందుగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో, ఉత్సాహభరితంగా నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఉత్సాహం కలిగించిందని, ప్రజల భాగస్వామ్యం కలిగిన కార్యక్రమాన్ని చూస్తున్నానని సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులకు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వనమహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాదని, అది ఒక పండుగగా, సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. దీపావళి, దసరా, సంక్రాంతి వంటి పండుగలను ఎలా ఆనందంగా జరుపుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా పండుగలా నిర్వహించా లని పిలుపునిచ్చారు. చరిత్రలో చక్రవర్తి అశోకుడు ఒక వృద్ధుడు మొక్కలు నాటుతున్న దృశ్యాన్ని చూసి, తన కోసం కాకుండా భావితరాల కోసం మొక్కలు నాటుతున్నానన్న ఆ వృద్ధుడి మాటలతో స్ఫూర్తి పొంది తన రాజ్యం అంతటా రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది కోట్లాది మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని, యూరప్‌లోని జర్మనీ వంటి దేశాల్లో కూడా తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా రహదారులు దెబ్బతినడం, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం, విచ్చలవిడిగా వనరులను వినియోగించడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. చెట్లు, పక్షులు, నేల, నీటి వనరులు, జీవ వైవిధ్యాన్ని కాపాడటం ద్వారా మాత్రమే భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించగలమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడమూ అంతే ముఖ్యమని అన్నారు. వనమహోత్సవం ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని, ప్రతి పౌరుడు తన ఇంటి వద్ద, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అమూల్యమైన ఆస్తి అని, ప్రకృతిని కాపాడితేనే ప్రకృతిమనలను కాపాడుతుందని, పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యకరమైన సమాజం, సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని, ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ భాద్యులు మట్టా దయనంద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వైరా ఎమ్మెల్యే



సింగరేణి జూలై 3 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల పరిధిలోని రేవులగూడెం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ ఆవుల సత్యనారాయణ యశోద దంపతుల కుమార్తె శిరీష సురేంద్ర వివాహానికి హాజరై నూతన వధూవరులను వైరా ఎమ్మెల్యే ఆశీర్వదించి దీవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంజుల, సర్పంచుల సంఘ అధ్యక్షులు రంజిత్ కుమార్,సర్పంచ్ టోనీ, సర్పంచ్ హిరాలాల్, సొసైటీ డైరెక్టర్ ఐలయ్య, సర్పంచ్ మోతే వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితాను పరిశీలించిన ఎమ్మెల్యే.




సింగరేణి జులై 3 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల పరిధిలోని రేగులగూడెం గ్రామపంచాయతీలో ఎస్.ఐ.ఆర్ సర్వే ని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ ఏజెంట్ బి.ఎల్.ఓ, బి ఎల్ ఏ లు ఇంటింటికి తిరిగి వివరాలు తెలుసుకోవాలని కోరారు. స్వతంత్రంగా, 1987 నుండి 2004 మధ్యలో పుట్టిన వారు స్వతంత్రంతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి, 2004 తర్వాత పుట్టిన వారు స్వతంత్రంతోపాటు తల్లిదండ్రులు, లేకపోతే తాత, నా నంబర్ ధ్రువీకరణ ఆధారతో పాటు సమర్పించాలని కోరారు. రెండు ఫారాలు అందజేయడంతో ఫారాన్ని నింపి ఒక ఫారం అందివ్వాలని కోరారు. మ్యాపింగ్ అయినవారు ఎటువంటి డాక్యుమెంట్ సమర్పించవలసిన అవసరం లేదని, మ్యాపింగ్ కాని వారు 11 రకాల ధ్రువీకరణతో ఏదో ఒకటి సమర్పించాలని ఓటర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అప్పులపై ప్రభుత్వము తప్పుడు లెక్కలు చెబుతుంది: హరీష్



జులై 3 (నిర్భయవార్త) జిల్లా ప్రతినిధి: గత టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతుందని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు సంగారెడ్డిలో సిఎస్సార్ గార్డెన్లో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సిఏజి నివేదికను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తాము చేసిన అప్పుల వివరాలను కూడా ప్రజల ముందు ఉంచాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## ఏ ఎన్ ఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం

### హార్ధం వ్యక్తం చేసిన పోడు రైతులు
### రేవంత్ రెడ్డి, సీతక్క, కోదండ రెడ్డి లకు పాలాభిషేకం చేసిన పోడు రైతులు
### చారిత్రాత్మక మైన న్యాయం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
### సీతక్క, కోదండ రెడ్డి చొరవతోనే పోడు రైతులకు న్యాయం జరిగింది
### అడవికి అసలైన యజమానులు ఆదివాసీలే పేర్కొన్న నర్సింహా మూర్తి నాగరాజు



ములుగు జూలై 03, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జల్ జంగిల్ జమిన్ నినాదంతో ఆదివాసీలు శతబ్దాలు గా పోరాటాలు చేస్తే అడవి పైన ఆదివాసీలకు లభించాయి అని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి, వాసం నాగరాజు లు తెలియజేశారు. అడవికి యజమానులు ఆదివాసీలే అని వారు పేర్కొన్నారు. యజమాని హక్కులు గుర్తించడం లో భారత ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో పోడు భూములను భూ భారతి పోర్టల్ లో చేర్చాలని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ని కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసినట్టు వారు తెలిపారు. రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ములుగు జిల్లా మంత్రి దనసరి సీతక్క ప్రత్యేక చొరవతో భూ భారతి పోర్టల్ లో పోడు భూములకు చోటు దక్కిందని నర్సింహా మూర్తి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. వెంకటాపురం వాజేడు మండలాల ఆదివాసీ పోడు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చిత్ర పటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వర్ధిలాలి అని రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీతక్క, కోదండ రెడ్డి లకు రైతులు జేజేలు పలికారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినప్పటికి పోడు భూములను డిజిటలైజేషన్(క్రమంబద్దికరణ ) చేయలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి తో వ్యవహరించినట్టు తెలిపారు. కోదండ రెడ్డి ఆదివాసీల పట్ల అంకిత భావంతో ఉన్నారని అన్నారు. మంత్రి సీతక్క కోదండ రెడ్డి చొరవతో పాలెం వాగు ప్రాజెక్ట్ కాలువకు పది కిలోమీటర్ల వరకు రైతులకు త్రి పేస్ కరెంట్ లైన్ వేపించారని, ఆదివాసీ రైతులకు వ్యవసాయ బోర్లు వేపించినట్టు వివరించారు. పోడు భూములను భూ భారతి చేర్చక పోవడం వల్ల పట్టాలు ఉన్నప్పటికీ పోడు భూములు లాక్కోవడం, అక్రమ కేసులు పెట్టడం జరిగేది అనన్నారు. పట్టా భూముల్లో వ్యవసాయ బోర్లు కరెంట్ లైన్ వేయాలన్న అటవీ శాఖ అధికారులు అడ్డుకునే వారు అని, బ్యాంకు రుణాలు కూడా ఇచ్చే వారు కాదన్నారు. ప్రభుత్వం పోడు భూములను భూ భారతి పోర్టలో చేర్చడం వల్ల బ్యాంకు రుణాలు, వ్యవసాయ బోర్లు కరెంట్ లైన్ ఏర్పాటు చేసుకునే వెసులు బాటు కలిగిందన్నారు. భూ భారతి పోర్టల్ లో పోడు భూములను చేర్చడం వల్ల పోడు భూముల పై సంపూర్ణ హక్కులు ఆదివాసులకు లభించాయన్నారు. ఐదో షెడ్యూల్ పరిపాలన కొనసాగించాలని, ఎల్ టి ఆర్, పెసా, అటవీహక్కుల గుర్తింపు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నర్సింహా మూర్తి నాగరాజు కోరినారు. సాగులో ఉన్న పోడు, రెవిన్యూ భూములకు పట్టాలు మంజురు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంజ మహేష్,మొడెం నాగరాజు,ఉప సర్పంచ్ కంతి శంకర్, పద్మ, కంతి విజయ్, పాయం బాబు,వాజేడు వెంకటాపురం పోడు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా కె వి కె కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఫార్మా డీ కాన్వకేషన్ వేడుక

(నిర్భయవార్త) జిల్లా ప్రతినిధివనస్థలిపురం:

వనస్థలిపురంలోని పిస్తా హౌస్ వేదికగా కె వి కె కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఫార్మా డీ 2026 కాన్వకేషన్ వేడుకను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. 2026 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రముఖుల చేత ఈ వేడుకలో పట్టాలను అందజేశారు. కళాశాల చైర్మన్, ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ అండ్ ప్రిన్సిపల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎం.సునీత రెడ్డి, ఏఐజి హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ. చిరంజీవి రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . కేఈఎస్ సొసైటీ కార్యదర్శి, కరస్పాండెంట్ సతీష్ కడియాల ముఖ్య పరిరక్షకులుగా వ్యవహరించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ ఎం.సునీత రెడ్డి, డాక్టర్ ఏ.చిరంజీవి రావు మాట్లాడుతూ..ఫార్మా డీ పూర్తి చేసిన విద్యార్థులు క్లినికల్ ఫార్మసీ,పరిశోధన, ఔషధ భద్రత రంగాలలో విశేష సేవలు అందించాలని పిలుపునిచ్చారు. నిరంతర విద్య,నైపుణ్యాభివృద్ధి,వృత్తి నైతికతను అలవర్చుకుంటే జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక వైద్య సేవల్లో క్లినికల్ ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని.. రోగులకు సురక్షితమైన చికిత్స అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పట్టభద్రులకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సతీష్ కడియాల మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తూ కళాశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఫార్మా డీ పట్టభద్రులు తమ జ్ఞానాన్ని సమాజాభివృద్ధికి వినియోగిస్తూ.. సేవాభావంతో వృత్తి నిబద్ధతను చాటాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సతీష్ చంద్ర కోరారు. కళాశాల అధ్యాపక బృందం సమన్వయంతో జరిగిన ఈ వేడుకలో ప్రొఫెసర్లు,సిబ్బంది, విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పార్టీ సారథ్యం కోసం కొట్టేసాయి దరఖాస్తు.



శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి : శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కొట్టే సాయి ప్రసాద్ శుక్రవారం జనసేన పార్టీ నిర్మాణ సారథ్యం పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదవులకు దరఖాస్తు చేసుకోవాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఒక్కో పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్చార్జిలను నియమించారు. వివిధ విభాగాలకు సంబంధించిన పదవులకు కార్యకర్తలు దరఖాస్తులు చేసుకుంటున్నారు. తిరుపతి పార్లమెంటు ఇంచార్జి లోకం మాధవి దరఖాస్తులను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కొట్టే సాయిప్రసాద్ పార్టీ నిర్మాణ సారధ్య పదవికి దరఖాస్తు చేశారు...

# కుంభాభిషేకంలో టిడిపి నాయకులు



శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి,:..శ్రీకాళహస్తిలో జరిగిన కుంభాభిషేకం కార్యక్రమాల్లో శుక్రవారం పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని బాపూజీ వీధిలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ద్వాదశ మహా కుంభాభిషేకం జరిగింది. టిడిపి నాయకురాలు బొజ్జల బృందమ్మ కన్యకా పరమేశ్వరి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మురళి, శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు గురవ్ప శెట్టి తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు గ్రామంలో మేడాలమ్మ మహా కుంభాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో కూడా బృందమ్మ పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పాపిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆమెకు స్వాగతం పలికారు..



# నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి హామీ.



శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి :టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ని తిరుపతి పార్లమెంట్ నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఫెడరేషన్ నిధులు, ఆధునిక సెలూన్ షాపులకు సబ్సిడీలు, 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్, కార్పొరేషన్ ద్వారా రుణాలు వంటి అంశాలపై వినతిపత్రం అందజేశారు. లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ, నాయి బ్రాహ్మణుల సంక్షేమం టీడీపీ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని తెలిపారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోట చంద్రశేఖర్ కృషిని అభినందించారు.

# గోపీ ముదిరాజ్ ప్రాణత్యాగం వెలకట్టలేనిది.

**డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి.**



శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి,:.గత వైసిపి పాలకుల ఆగడాలను, అకృత్యాలను భరించలేక,వారి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎదురొడ్డి పోరాడి,వైసిపి నాయకుల కక్ష పూరితంగా చేసిన దౌర్జన్యానికి బలైన తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకుడు గోపీ ముదిరాజ్ ప్రాణత్యాగం వెలకట్టలేనిది అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు.స్వర్గీయ మేలుపాకు గోపీ ముదిరాజ్ తెలుగుదేశం పార్టీకి సేవలను స్మరించుకుంటూ,కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత గోపీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ అండగా ఉండాలని, బుధవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ క్యాడర్ మీటింగ్ అనంతరం లోకేష్ ని కలిసి విన్నవించడం జరిగింది.శ్రీకాళహస్తి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న తొట్టంబేడు మండల కేంద్రం అయిన తొట్టంబేడు గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ సంపదను గాని, ఇటు ప్రైవేటు ఆస్తులను గాని దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న నాటి వైసిపి నాయకుల దురాగతాలను ఎదిరించిన పాపానికి, వైసిపి వారి చేతిలో మే 29 వ తేదీ, 2020 వ సంవత్సరంలో అత్యంత అమానుషంగా హత్య గావించబడ్డ తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకుడు మేలుపాకు గోపీ ముదిరాజ్ కుటుంబాన్ని ఆదుకోవడానికి తెలుగుదేశం పార్టీ తరఫున తగిన చర్యలు తీసుకునేలా చూడమని విన్నవిస్తూ నిన్నటి రోజు తెలుగుదేశం పార్టీ,జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి వినతి పత్రాన్ని సమర్పించారు.వైసిపి అధినేత జగన్ రెడ్డి... తన తాత నుండి వారసత్వంగా తెచ్చుకున్న రాజారెడ్డి రాజ్యాంగాన్ని ఆధారంగా చేసుకొని నాటి ప్రభుత్వం సాగించిన ఆటవిక పాలనకు వ్యతిరేకంగా, అంబేద్కర్ రాజ్యాంగ పాలన కోసం జరిపిన ధర్మ పోరాటానికి ముందుండి నాయకత్వం వహించి, మాన, ప్రాణ మరియు ఆస్తులను కోల్పోయిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త లలో అధికశాతం బిసి బిడ్డలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తొట్టంబేడు గ్రామం కేంద్రంగా చేసుకొని నాటి వైసిపి నాయకులు సాగించిన భూ దోపిడీని అరికట్టడానికి చర్యలు తీసుకోమని ఎన్డీయే కూటమి నాయకులు పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకపోగా,అధికార యంత్రాంగం పరోక్షంగా కబ్జారాయుళ్ళకు మద్దతుగా నిలవడంతో స్వర్గీయ గోపీ ముదిరాజ్ లాంటి వారు చేసిన ప్రాణ త్యాగాలకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.వైసిపి నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన కబ్జాలకు,దోపిడీకి,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడి, వైసిపికి చెందిన సైకోల చేతిలో ప్రాణాలొదిలిన త్యాగధనుల పోరాటాలు నిష్ఫలం కాకుండా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్,శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,తొట్టంబేడు మండల తెలుగు యువత అధ్యక్షుడు బీమాల చందు, సీనియర్ నాయకులు బీమాల వెంకటేశ్వర్లు, గురుమూర్తి,మేలుపాకు మునిప్రసాద్, మునిరత్నం,దామోదరం,వెంకటయ్య, బీమాల చలపతి, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వేదాద్రి--కంచలకు పునర్జీవం

**రూ.15 కోట్లతో. మరమ్మతులకు శ్రీకారం**
**2027 ఖరీఫ్ నాటికి సాగునీరు అందిస్తాం.**
**మంత్రి నిమ్మల.**




జగ్గయ్యపేట, నిర్భయవార్త ప్రతినిధి,:.ఎన్నాళ్లుగానో నిలిచిపోయిన వేదాద్రి--కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి వద్ద కృష్ణానదిపై ఉన్న ఈ పథకానికి రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మరమ్మతు పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధుల కింద రూ.33 లక్షలతో మరమ్మతు చేసిన మోటార్ పంపును కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వేదాద్రి--కంచల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి 2027 ఖరీఫ్ నాటికి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని ఇతర ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు కూడా దశలవారీగా ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, రైతులకు ఇచ్చిన హామీ మేరకు పథకం పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఈ పనులు పూర్తయితే 17,200 ఎకరాల ఆయకట్టు భూమికి మళ్లీ సాగునీరు అందడంతో వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని ఇతర ఎత్తిపోతల పథకాలను కూడా దశలవారీగా పునరుద్ధరిస్తామనిపేర్కొన్నారు.విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ, పథకం పునరుద్ధరణతో ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఏపీఎస్ఐడీసీ ఛైర్మన్ వేళ్ల లీలాకృష్ణ, లాల్‌బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, నందిగామ డీసీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# “బాబు షూ్యరిటీ-- భవిష్యత్తు గ్యారంటీ హామీల అమలుపై పెరుగుతున్న ప్రజల ఆందోళన.

**న్యాయం కోరుతున్నదరఖాస్తుదారులు.**

నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :ధి.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నికల సమయంలో ప్రకటించిన “బాబు షూ్యరిటీ -- భవిష్యత్తు గ్యారంటీ” హామీలు ప్రస్తుతం మరోసారి ప్రజా చర్చకు దారితీస్తున్నాయి. తెలుగుదేశం పార్టీఆధ్వర్యంలో, నారా చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేష్ నేతృత్వంలో ఈ హామీలు యువత, నిరుద్యోగులు, వృద్ధులు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు భరోసా కలిగించే లక్ష్యంతో ఎన్నికల సమయంలోప్రకటించబడ్డాయి.ఈ పథకంలో ఉద్యోగ భరోసా, ఆర్థిక భరోసా, గృహ భరోసా, పోషణ భరోసా వంటి అంశాలు ప్రజలకు పెద్ద ఆశలు కలిగించాయి. అనేక మంది దరఖాస్తుదారులు ఈహామీలపై నమ్మకంతో నమోదు చేసుకున్నట్లు చెబుతున్నారు.అయితే, ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాతరెండున్నర సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో, దరఖాస్తు చేసుకున్న వారిలో పెద్ద భాగానికి ఇంకా ప్రత్యక్ష ప్రయోజనాలు అందలేదని కొంతమంది వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ముఖ్యంగా మధ్య వయస్సు (40--50) సంవత్సరాలు గల నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రధానంగా పెన్షన్ వ్యవస్థ కొనసాగుతున్నప్పటికీ, ఇతర “గ్యారంటీ” అంశాల అమలుపై స్పష్టత మరియు వేగవంతమైన చర్యలు అవసరమని దరఖాస్తుదారులు కోరుతున్నారు. వారు తమ దరఖాస్తుల పరిశీలన చేసి, ప్రతి ఒక్కరికీ హామీ ప్రకారంన్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికల హామీలు అమలవడం పట్ల ఉన్న ఆశలు మరియు వాస్తవ పరిస్థితుల మధ్య ఉన్న వ్యత్యాసం మరోసారి రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది.




# షార్ట్ సర్క్యూట్‌తో సర్వస్వం కోల్పోయిన బాలింత.

**కుటుంబానికి మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్, దాత తిరుమల శెట్టిసురేష్ లచే నిత్యావసరాల పంపిణి.**

పొన్నూరు, నిర్భయవార్త ప్రతినిధి :పొన్నూరు పట్టణంలోని ఆలూరు రోడ్డులో నివసిస్తున్న షేక్ షర్మిల, బాజీల గృహంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి, ఇంట్లో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి, ఆర్థిక ఇబ్బందులకు గురైంది. ముఖ్యంగా బాధితురాలు షేక్ షర్మిల నిండు బాలింత కావడంతో వారి పరిస్థితి మరింత హృదయవిదారకంగా మారింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మనపొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ టీం సభ్యులు తక్షణవే స్పందించారు. బాధితులను ఆదుకునేందుకు కతార్ (ఘ్ఖుతీ) లో ఉంటున్న ప్రముఖ దాత, తిరుమల శెట్టి సురేష్ గారిని సంప్రదించగా, ఆయన పెద్ద మనసుతో సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. సురేష్ ఆర్థిక సహాయంతో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం మరియు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులనుఅసోసియేషన్ సభ్యులు నేడు అందజేశారు. మనపొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ట్రెజరర్ చిలకపాటి సింహాద్రి, సభ్యులు కుప్పాల పవన్ కుమార్ తదితరులు పాల్గొని బాధితులకు సరుకులను అందజేసి, వారికి ధైర్యాన్ని చెప్పారు. విపత్కర సమయంలో స్పందించి సహాయం అందించిన దాత సురేష్ కి, అసోసియేషన్ సభ్యులకు బాధితులు మరియు స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# పుష్కరిణి భూమిపై ఆక్రమణ దారులకు ఎదురుదెబ్బ

**ఆర్ఎస్ నెం.518పై అప్పీలు కొట్టివేత..**



**తహశీల్దార్ తొలగింపు ఉత్తర్వులకు ఆర్‌డీఓ మద్దతు.**

నందిగామ,నిర్భయవార్త ప్రతినిధి ;.నందిగామ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పుష్కరిణికి సంబంధించిన ఆర్ఎస్ నెం.518 (ఎకరం 1.25 సెంట్లు) భూమిపై ఆక్రమణదారులు దాఖలు చేసిన రెండు అప్పీళ్లను రెవెన్యూ డివిజనల్ అధికారి కె. బాలకృష్ణ కొట్టివేశారు. 2023 అక్టోబర్ 6న తహశీల్దార్ జారీ చేసిన ఆక్రమణల తొలగింపు ఉత్తర్వులను సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆర్ఎస్ నెం.518 ప్రభుత్వ పోరంబోకు గుంటగా నమోదై ఉండటంతో పాటు, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిగా వినియోగంలో ఉందని ఆర్‌డీఓ పేర్కొన్నారు. జలవనరులపై ఆక్రమణలను చట్టబద్ధంగా కొనసాగించడం లేదా క్రమబద్ధీకరించడంసాధ్యం కాదని స్పష్టం చేశారు.అప్పీలుదారులు తమ కుటుంబాలు దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్నాయని, మున్సిపల్ ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లిస్తున్నామని, ప్రభుత్వ గృహ పథకాల ద్వారా ఇళ్లు నిర్మించుకున్నామని వాదించారు. అయితే పన్నులు చెల్లించడం వల్ల యాజమాన్య హక్కులు లభించవని ఆర్‌డీఓ పేర్కొన్నారు. విచారణ సందర్భంగా తహశీల్దార్ సమర్పించిన రెవెన్యూ రికార్డులు, ఆలయ కార్యనిర్వాహక అధికారి సమర్పించిన చారిత్రక పత్రాలు, ఇరు పక్షాల లిఖితపూర్వక వాదనలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. జలవనరులపై ఆక్రమణలను తొలగించాలని సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిన తీర్పులను కూడా ఉత్తర్వులో ప్రస్తావించారు.దీంతో ఆర్ఎస్ నెం.518లోని ఆక్రమణలను తొలగించేందుకు నందిగామ తహశీల్దార్ చేపట్టిన చర్యలు కొనసాగనున్నాయి. అప్పీలుదారులకు ఆ భూమిపై ఎటువంటి హక్కు లేదని, చట్టప్రకారం తదుపరి బహిష్కరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# స్టిల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలి

## మైలవరంలోసిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిరసన

నిర్భయవార్త ప్రతినిధి :.మైలవరం: విశాఖ స్టీల్ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం నుంచి పంచాయతీ సెంటర్,వరకు ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు ఎన్ సి హెచ్ శ్రీనివాస్, ఏ వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రాష్ట్రానికే తలమానికంగా ఉందన్నారు. ఈ ప్లాంట్లో లక్ష మందికి పైగా కార్మికులు పనులు చేస్తున్నారని అన్నారు. యాజమాన్యం బాధ్యతారాహిత్యం వల్లే జూన్ 8న విశాఖ స్టీల్ ప్లాంట్ లో ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. విశాఖ స్టీలు ప్రమాద మృతులకు కోటి రూపాయలు, గాయపడిన వారికి 50 లక్షలు నష్టపరిహారంఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు.

# 22వ వార్డులో ఎమ్మెల్యే తాతయ్య పర్యటన ప్రజల సమస్యలపై ఆరా.

### పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం.



జగ్గయ్యపేట,నిర్భయవార్త ప్రతినిధి :జగ్గయ్యపేట పట్టణంలోని 22వ వార్డులో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పర్యటించి స్థానికులతో మమేకమయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని, వార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి సమస్యలను ప్రాధాన్యక్రమంలో పరిష్కరించి ప్రతి వార్డును ఆదర్శవంతంగాతీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు సూచించిన సమస్యలను వెంటనే నమోదు చేసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, 22వ వార్డు కౌన్సిలర్ గొట్టే నాగరాజు, కర్ల జోజి, దువ్వల రామకృష్ణ, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మల్లెల కొండయ్య, చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ మహంకాళి జయప్రకాష్, పీఎంఎస్ఆర్ బాబ్జీ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అక్బర్, పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు షేక్ మదార్, పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఉమ్మర్, షేక్ మాబు మియా, కావేటి కృష్ణ, గంజనబోయిన శ్రీను, పసుపునూరి శివ,బొక్కల గోపిబాబు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నాయకులను ప్రమర్శించిన మంద కృష్ణా మాదిగా.



మైలవరం, నిర్భయవార్త ప్రతినిధి :.గత కొన్ని రోజుల క్రితం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నూకపోగు ఏసు మాదిగ ఉద్యమ కార్యచరణలో భాగంగా ప్రయాణిస్తూ ఉన్నపుడు ప్రమాదానికి గురియై. కాలుకి బలమైన గాయం తగిలి కండరాలు తెగిపోవటం కారణంగా శస్త్ర చికిత్స నిమిత్తం.విజయవాడ, సత్యనారాయణపురం, స్వర హాస్పటల్లోజాయిన్ అయ్యారు. ఆయనను పరామర్శించడానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ , స్వర హాస్పిటల్ కి విచ్చేసి, ఆర్థోపెడిక్ డాక్టర్ చాట్ల రత్న కాంత్ తోఏసు మాదిగ యొక్క ప్రస్తుత పరిస్థితి పై , జరగబోయే శాస్త్ర చికిత్స గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అందుకు డాక్టర్ చాట్ల రత్న కాంత్ స్పందించి మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణ మాదిగ స్వర హాస్పిటల్ సియిఓ డాక్టర్ వెంకట తో ఫోన్లో మాట్లాడటం జరిగింది.

# ఆర్థిక సంక్షోభంలో పూజారులు, భక్తి మసకబారిన గుడులు.

నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి : దేశ వ్యాప్తంగా పూజారుల పరిస్థితి చర్చనీయాంశం అయ్యింది. గుడులలో పూజారులు కచ్చితమైన ఆదాయం లేకపోవడం వల్ల, వారి కుటుంబాలు, పిల్లల చదువు, వైద్య సేవలు దాటిపోతున్నాయి. గుడులు కేవలం భక్తి కేంద్రాలు మాత్రమే కాక, సంస్కార కేంద్రాలుగా ఉండేలా ఉండాలి.పూజారుల జీతాలు అత్యధికంగా ?5000 మాత్రమే ఉండటం, వారి జీవన స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. కొంతమంది పూజారులు, కడుపు నింపకపోవడం కారణంగా, గుడి సేవలపై నమ్మకం లేకపోవడం, సంప్రదాయాలు భక్తితో కొనసాగకపోవడం వంటి సమస్యలుఎదుర్కొంటున్నారు.సంస్కృతి నిల్వ కోసం ప్రభుత్వం, ధర్మసంస్థలు పూజారుల జీవితానికి వెలుగు నింపే విధంగా దక్షిణ,వేతనాలు, భవనాలు, ఆరోగ్య భరోసా వంటి చర్యలు తీసుకోవాలి. భక్తి, సేవ, సంతోషంతో పూజారుల జీవితంలో ఉంటేనే, సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి పదికాలాలుగా నిలుస్తాయి. ప్రభుత్వాలు సనాతన ధర్మం అని చర్చలు జరుగుతున్నాయి కానీ అర్చకుల ఆర్తనాదాలు పట్టించుకోవడం లేదు అర్చకులకు ఆర్థిక భరోసా మరియు దూపదీప నైవేద్యం కల్పిస్తూ కఠిన షరతులు పెట్టకుండా ధర్మ పరిరక్షణ చేయవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై బుచ్చిలో జేసీ ఆకస్మిక తనిఖీ.

### 97% ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి...
### 36% డిజిటలైజేషన్ పూర్తి.

బుచ్చిరెడ్డిపాలెం,నిర్భయవార్త ప్రతినిధి :స్పషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయడంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు శుక్రవారం బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, ఓటర్ల నెల్లూరు జిల్లాలో ఇప్పటివరకు 97% ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఇనమల చినబాబుతో సమావేశమై ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, నెల్లూరు జిల్లాలో ఇప్పటివరకు 97 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయ్యిందని, అందులో 36 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన



గడువు మేరకు జూలై 14వ తేదీలోపు మొత్తం ప్రక్రియను పూర్తిచేయాలని అన్ని శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పని చేసి ప్రతి అర్హుడైన ఓటరిని ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని, ఎలాంటి ఫారం పెండింగ్‌లో ఉ ండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. డిజిటలైజేషన్ పనులను మరింత వేగవంతం చేసి ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.మున్సిపల్ కమిషనర్ ఇనమల చినబాబు మాట్లాడుతూ, జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు ప్రత్యేక కార్యాచరణతో సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు కూడా బీఎల్‌ఓలకు సహకరించి అవసరమైన వివరాలు అందించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్షలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# "ఒక్క ఓటు పోనివ్వం.. దొంగ ఓటు చేరనివ్వం".

నెల్లూరు జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :.రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ



నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, వేగవంతంగా సాగాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి కోరారు. కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వోను కలిసి వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో ప్రారంభమైనప్పటి నుంచి ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాకాణి ఆరోపించారు. ఇదే అంశంపై గతంలో కూడా కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. కోవూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఎన్యూమరేషన్ ఫారాలను కొన్నిచోట్ల బీఎల్‌ఏలకు సమాచారం ఇవ్వకుండా పంపిణీ చేశారని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారందుర్వినియోగమవుతోందని ఆరోపించారు. కోవూరు నియోజకవర్గంలో ఫారాల పంపిణీ పూర్తయినా డిజిటలైజేషన్ ప్రక్రియ కనీసం 30 శాతం కూడా పూర్తికాలేదని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి కాకపోవడంతో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.బీఎల్‌ఓలుగా పనిచేస్తున్న పలువురికి కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం, డిజిటలైజేషన్‌పై సరైన శిక్షణ అందకపోవడం వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని చెప్పారు. నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధికారులు స్వయంగా చొరవ తీసుకుని ఫారాలు సేకరించి డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఎస్టీ ఓటర్ల ఫోటోల సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై కూడా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.మంత్రి నారాయణ అధికార వ్యవస్థపై ప్రభావం చూపుతున్నారని, బీఎల్‌ఓలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కాకాణి విమర్శించారు. కమిషనర్ వ్యవహారంపై ఫిర్యాదు చేసినప్పటికీ తీసుకున్న చర్యలపై స్పష్టత లేదని ప్రశ్నించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహించాలని సూచించారు.అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా పోకూడదని, అదే సమయంలో దొంగ ఓట్లు జాబితాలో చేరకుండా చూడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందని కాకాణి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీ నాయకులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారని తెలిపారు. అవసరమైతే మరోసారి జిల్లా అధికారులను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో మహమ్మద్ బాజీ.

### ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్ఠతకు కృషి చేస్తానన్న సభ్యుడు

విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగదారుల వ్యవహారాలు ఆహార , పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలోని రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఏపీ హైకోర్టు న్యాయవాది, సామాజిక సేవకుడు మహమ్మద్ బాజీ సభ్యునిగా నియమితులయ్యారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) పనితీరును పర్యవేక్షించడం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ఆహార భద్రతను బలోపేతం చేయడం వంటి కీలక బాధ్యతలు నిర్వహించే ఈ కమిటీలో కృష్ణా జిల్లా తరపున ఆయనకు అవకాశం లభించింది.రాష్ట్రంలోని రేషన్ పంపిణీ వ్యవస్థ సమర్థవంతంగా అమలవుతున్న తీరును పరిశీలించడం, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహార ధాన్యాలు అందుతున్నాయా అనే అంశాలపై పర్యవేక్షణ చేపట్టడం, పౌర సరఫరాల శాఖ పనితీరుపై ప్రభుత్వానికి సూచనలు, సిఫార్సులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతలుగా ఉన్నాయి. అలాగే వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను సూచించడంలోనూ కమిటీ కీలక పాత్ర పోషించనుంది.ఈ సందర్భంగా మహమ్మద్ బాజీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తనపై ఉ



ంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణతో పాటు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా కృషి చేస్తానన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టిక తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు అందిస్తానని చెప్పారు.రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో సభ్యునిగా సేవలందించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ ఒ ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.మహమ్మద్ బాజీ నియామకాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, సామాజిక సేవకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు స్వాగతించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన అనుభవం, సామాజిక సేవా దృక్పథం కమిటీకి ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇబ్రహీంపట్నం రిజిస్టర్ కు వక్ఫ్ బోర్డు నోటీసులు.

### కొండపల్లి 293/1 అక్రమ రిజిస్ట్రేషన్ పై నోటీసులు.
### పత్రికా కథనాలపై స్పందించిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు సంస్థ




ఇబ్రహీంపట్నం, నిర్భయవార్త ప్రతినిధి ;:.కొండపల్లి 293/1 సర్వే నెంబర్ లోని వక్ఫ్ బోర్డు స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ పై వార్త పత్రికలలో వచ్చిన కథనాలపై వక్ఫ్ బోర్డు స్పందించింది. వక్ఫ్ బోర్డు ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయడం చట్ట విరుద్ధమని, వక్ఫ్ చట్టం 1995 ప్రకారం బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొంటూ ఇబ్రహీంపట్నం రిజిస్టర్ కార్యాలయానికి నోటీసులు జారీ చేసింది. కొండపల్లి 293 సర్వే నెంబర్ లో హజరత్ ముర్తజ అలీ పంజా వక్ఫ్ బోర్డు సంబంధించిన స్థలాన్ని తమకు అమ్ముతానంటూ 18 లక్షలు తీసుకొని ఇప్పుడు వేరే వారికి రిజిస్ట్రేషన్ చేశారని కృష్ణ అనే వ్యక్తి కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై వార్తాపత్రికల్లో కథనాలు వచ్చాయి. ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ బాబా హజరత్ ముర్తుజా అలీ పంజా 18 వందల చదరపు గజాలు పీర్లపంజ చావిడి. దీని మాన్యం శాంతినగర్ 212ఏ 212 బి 18 ఎకరాల 30 సెంట్లు ఇష్టానుసారంగా పన్నులు వేసి సర్వే నంబర్లు మార్చి తప్పుడు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి దీనిపై అధికారులేదే బాధ్యత అని స్టేట్మెంట్స్ అయితే ఇచ్చారు.వెంటనే స్పందించిన వక్ఫ్ బోర్డ్ రిజిస్టర్ కు నోటీసులు జారీ చేసింది.నకలు కాపీని కలెక్టర్, డిఆర్ఓ తాసిల్దార్, ఇబ్రహీంపట్నం హౌస్ ఆఫీసర్ కు అందించారు.

# పేరుపోగు.క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయంచేయాలని..ముద్దాయి సిఐ నాగరాజును కఠినంగాశిక్షించాలని. న్యాయవాదులు నిరసన




నిర్భయవార్త ప్రతినిధి :ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో కోర్టు ఆవరణగేటు వద్ద న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు.. పేరుపోగు.క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని. ప్రభుత్వం దక్షిణం చర్యలు తీసుకొని. ముద్దాయి సిఐ నాగరాజును కఠినంగా శిక్షించాలని నిరసన తెలియజేయడంన్యాయవాదులు. ఈకార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఒగ్గు గవాస్కర్, బర్రె శ్రీనివాస్, మోటుపల్లి విఠల్రావు, షేక్ వలి, ప్రతాప్, ఆదాం కుమార్, సత్యనారాయణ రెడ్డి, సాయిరాం, బస్వారెడ్డి, రజాక్, కోటయ్య, అమెరి రమేష్, బోదల సౌమ్య, కండెల. వరప్రసాద్, సుభాని, బొడ్డు. నాగార్జున, కెనడీ, కంతేటి. విజయ్ కుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు

# నెల్లూరులో నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం.



నెల్లూరు, నిర్భయవార్త ప్రతినిధి :నెల్లూరులో తొలి మల్టీ-కంపెనీ ఏఐ ఇన్నోవేషన్ పార్క్ నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభమైంది.ప్రారంభోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొని మాట్లాడారు.వ్యవసాయం, ఆక్వాకల్చర్, పారిశ్రామిక రంగాలతో పాటు ఐటీ రంగంలోనూ నెల్లూరు ముందంజ వేయడం శుభపరిణామమని ఆమె అన్నారు. ఈ హబ్ ద్వారా జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, స్టార్టప్‌ల ఏర్పాటుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించినట్లు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదిగేలా యువత ఇన్నోవేషన్ హబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్, నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ వ్యవస్థాపకుడు రెనిల్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# మారాం చేసే పిల్లలను మాటలతో మార్చాలి!



కొత్తగా బడిలో చేరే చిన్నారులు, చిన్న తరగతులు చదివే పిల్లలు కొత్త వాతావరణానికి అలవాటు పడే క్రమంలో కొంత మారాం చేస్తుంటారు. స్కూలుకు వెళ్లటానికీ, భోజనం చేయటానికీ ఇబ్బంది పెడుతుంటారు. ఇది చాలా వరకు సహజమైన విషయమే. వాళ్లను కాస్త సముదాయించి మానసికంగా సిద్ధం చేస్తే ఎంచక్కా స్కూలుకు వెళ్తారు. సమయానికి భోజనం చేస్తారు. ఉత్సాహంగా ఉంటారు. వారితో ప్రేమగా, ఓపికగా మాట్లాడితే త్వరగా కలిసిపోతారు. ప్రతి విషయాన్ని నాన్నా, కన్నా, బుజ్జి అంటూ ఆప్యాయంగా చెబుతూ దారిలో పెట్టాలి.

పిల్లలకు సరదా దినచర్య అంటే ఇష్టం. స్కూల్‌కి వెళ్లే ముందు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే వారు ఉత్సాహంగా తయారవుతారు. స్కూల్‌కి టైమవుతుంది, బ్రష్ చేసుకో, స్నానం చేయ్, టిఫిన్ చేయ్ అంటూ హడావుడి చేయకుండా సరదాగా సిద్ధం చేయాలి. ఉదయం పూట కొంతసేపు ఆట, వినోదానికి అవకాశం కల్పించండి. ఉదాహరణకు పిల్లలు లేవగానే ఓ పది నిమిషాలు వారికి ఇష్టమైన ఆటలు ఆడనివ్వండి. లేదా ఇష్టమైన పనులు చేయనివ్వండి. ఇలా చేయడం వల్ల వారి మనసు ఆహ్లాదంగా ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్‌లో వారికి ఇష్టమైన వాటిని చేసి పెట్టాలి. దీంతో వారు ఆనందంగా స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతారు.

మారాం చేసే పిల్లలను బడికి సిద్ధం చేయడం తల్లిదండ్రులకు కొంత సవాలుగా అనిపించవచ్చు. కొందరు పిల్లల్లో స్కూల్ గురించి సందేహాలు, సంకోచం ఉంటాయి. స్కూల్ గురించి విన్న కొన్ని అపోహల వల్ల కూడా అలాంటి భావన ఏర్పడుతుంది. అందుకే పిల్లల ముందు స్కూల్ గురించి ఎప్పుడూ సానుకూలంగా మాట్లాడండి. స్కూల్‌కి వెళితే కొత్త స్నేహితులతో సరదాగా ఆడుకోవచ్చని, కొత్త విషయాలు నేర్చుకోవచ్చని వారికి ఉత్సాహం ఇవ్వండి. టీచర్లు కూడా ఎంతో ప్రేమగా చూసుకుంటారని, అవసరమైన సహాయం అందిస్తారని చెప్పండి. మీ చిన్నతనంలో స్కూల్‌లో జరిగిన సరదా సంఘటనలను కథలుగా చెప్పండి.



దీంతో పిల్లలు స్కూల్‌ను ఆనందంగా గడిపే ప్రదేశంగా భావిస్తారు. రోజూ స్కూల్‌కి వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు.

**ప్రోత్సాహం :** స్కూల్ నుంచి వచ్చిన తర్వాత "ఈ రోజు ఏ పాఠాలు చెప్పారు? బాగా చదువుతున్నావా?" అని అడిగే బదులు, "ఈ రోజు ఏ ఆటలు ఆడుకున్నావు? మీ స్నేహితులతో ఎలా గడిపావు? ఈ రోజు కొత్తగా ఏమి నేర్చుకున్నావు?" అని అడగండి. వాళ్ల మాటలను ఆసక్తిగా వినండి. అలాగే స్కూల్ బ్యాగ్ సర్దడం, టిఫెన్ బాక్స్ సిద్ధం చేసుకోవడం వంటి పనుల్లో పిల్లలను భాగస్వాములను చేయండి. దీనివల్ల వారిలో బాధ్యత పెరుగుతుంది. స్కూల్‌లో జరిగే వివిధ కార్యక్రమాలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యాక్టివిటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించండి. చదువుతో పాటు ఆటలు, స్నేహాలు, సృజనాత్మక కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వండి.

**స్నేహభావం :** పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా అప్పుడప్పుడు స్కూలుకు వెళ్లి తరగతి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, ఇతర స్కూలు సిబ్బందితో స్నేహంగా మెలగాలి. దీనివల్ల పిల్లలకు స్కూలు వాతావరణం సుపరిచితంగా అనిపిస్తుంది. వీలు చిక్కినప్పుడల్లా నవ్వు తెప్పించే కథలు, సరదా సంఘటనలు చెబుతూ స్కూల్‌పై ఆసక్తిని పెంచాలి.

**బుజ్జగించాలి :** పిల్లలు స్కూలుకు వెళ్లనని మారాం చేసినప్పుడు ప్రశాంతంగా మాట్లాడాలి. వారి మనసులో ఏముందో తెలుసుకోవాలి. స్కూల్‌కు వెళ్లాలనిపించకపోవడానికి గల కారణాన్ని ఓపికగా వినాలి. కారణాన్ని బట్టి వారికి అర్థమయ్యేలా వివరించి, స్కూలుకు వెళ్లాలనే ఆసక్తి కలిగేలా చేయాలి. వారి ఆత్మస్థైర్యాన్ని పెంచాలి.

**మాటామంతి :** పిల్లలు తరచూ స్కూల్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపకపోతే క్లాసు టీచర్‌తో మాట్లాడండి. పిల్లలు స్కూల్‌లో ఎదుర్కొంటున్న పరిస్థితులు ఏమిటో తెలుసుకోండి. క్లాస్‌మేట్‌తో చిన్న గొడవ, పాఠాలు అర్థం కాకపోవడం, ఒంటరిగా అనిపించడం వంటి కారణాలు కూడా ఉండొచ్చు. వాటిని ఉపాధ్యాయుల సహకారంతో పరిష్కరిస్తే పిల్లలు మళ్లీ ఉత్సాహంగా స్కూల్‌కి వెళ్లడం ప్రారంభిస్తారు. పిల్లలను వీలైనంత వరకు స్కూలులో దింపడం, స్కూలు అయిపోయాక తీసుకురావడం చేయాలి. స్కూల్లో తమ పిల్లలు ఎలా ఉంటున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటూ ఉండాలి. వారు చెప్పిన సలహాలు, సూచనలు పాటించాలి.

**ఓపిక :** ప్రతి చిన్నారి తనదైన వేగంతో కొత్త వాతావరణానికి అలవాటు పడతాడు. అందుకే తల్లిదండ్రులు ప్రేమతో, ఓర్పుతో వ్యవహరించాలి. ఎల్లప్పుడూ వారికి అండగా ఉన్నామనే భరోసా కల్పించాలి. చిన్న చిన్న మంచి పనులను కూడా మెచ్చుకోవాలి. "నా చిన్ను త్వరగా రెడీగా అయిందే", "నా బంగారం వెరీ గుడ్ బాయ్" అంటూ ప్రోత్సహిస్తే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. స్కూల్‌పై మంచి అభిప్రాయం ఏర్పడి, ఆనందంగా బడికి వెళ్తారు.



- ఎస్‌పి మనోహర్,
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

## టీ తాగడం మంచిదే..
# కానీ ఈ 6 పొరపాట్లు చేస్తే సమస్యలు తప్పవు

రోజువారీ జీవితంలో టీ ఒక భాగంగా మారిపోయింది. ఉదయం నిద్రలేవగానే, పనిలో ఒత్తిడి తగ్గించుకోవడానికి, సాయంత్రం సేదతీరడానికి, కొందరు రాత్రి పడుకునే ముందు కూడా టీ తాగుతుంటారు. అయితే, టీని ఎక్కువగా లేదా సరికాని సమయంలో తాగడం వల్ల గుండెల్లో మంట, అసిడిటీ, నిద్రలేమి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మిల్క్ టీ, బ్లాక్ టీ, గ్రీన్ టీలో కెఫిన్ ఉంటుంది. ఇది కడుపులో ఆమ్లాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. ఎక్కువ మొత్తంలో టీ తాగితే అన్నవాహిక మధ్య ఉండే కండరం బలహీనపడుతుంది. దీంతో కడుపులోని ఆమ్లం పైకి వచ్చి అసిడిటీ, గుండెల్లో మంటకు కారణమవుతుంది. ఖాళీ కడుపుతో టీ తాగడం లేదా రోజంతా పదేపదే టీ తాగడం వల్ల ఈ సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది.




**వేడివేడిగా టీ తాగితే ప్రమాదం!**

చాలామంది టీ చల్లారకముందే చాలా వేడిగా తాగేస్తుంటారు. కానీ ఇది గొంతు, అన్నవాహిక లోపలి పొరలను దెబ్బతీస్తుంది. ఇలాంటి అలవాటు చాలా కాలం కొనసాగితే అన్నవాహిక క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకే టీ కొద్దిగా చల్లారిన తర్వాత తాగడం మంచిది.

**టీ బ్యాగులతో కూడా జాగ్రత్త**

ఇటీవలి కాలంలో టీ బ్యాగుల వినియోగం పెరిగింది. అయితే ప్లాస్టిక్ పూత ఉన్న కొన్ని టీ బ్యాగులను వేడి నీటిలో వేయడం వల్ల సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు టీలో కలిసే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి శరీరంలో హార్మోన్ల అసమతుల్యత, ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు..

**టీ వల్ల రక్తహీనత వచ్చే అవకాశం**

టీలో ఉండే టానిన్లు శరీరం ఐరన్‌ను గ్రహించే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. ముఖ్యంగా భోజనం చేసిన వెంటనే టీ తాగే అలవాటు ఉంటే ఐరన్ శోషణ తగ్గి రక్తహీనత వచ్చే ప్రమాదం ఉంటుంది.

**రాత్రిపూట టీ తాగొచ్చా?**

రాత్రి సమయంలో టీ తాగితే అందులోని కెఫిన్ నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. దీని వల్ల గాఢ నిద్ర తగ్గి మరుసటి రోజు అలసటగా అనిపించవచ్చు. కాబట్టి రాత్రిపూట టీకి బదులుగా కెఫిన్ లేని హెర్బల్ టీలు లేదా ఇతర ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకోవడం మంచిది.

**టీ తాగేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు**

టీ తయారైన తర్వాత కొన్ని నిమిషాలు చల్లారనిచ్చి తాగాలి. రోజుకు 2--3 కప్పుల కంటే ఎక్కువ టీ తాగకూడదు. ప్లాస్టిక్ టీ బ్యాగులకు బదులుగా టీ ఆకులతో తయారుచేసిన టీ తాగడం మంచిది.

ఖాళీ కడుపుతో టీ తాగే అలవాటు మానుకోవాలి. భోజనం చేసిన వెంటనే టీ తాగకుండా కొంత విరామం ఇవ్వాలి. రాత్రిపూట టీకి బదులుగా హెర్బల్ టీ లేదా కెఫిన్ లేని పానీయాలు తీసుకోవాలి. టీలో యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే మితంగా, సరైన సమయంలో తాగితేనే వాటి ప్రయోజనాలు పొందవచ్చు.

## వామ్మో జ్వరం!

ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా జ్వరాల వ్యాప్తి పెరిగింది. ధర్మవరంలో విజృంభిస్తున్నాయి. జ్వర పీడితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. రోజువారీ ఓపీలో వారే అధికంగా ఉంటున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతోపాటు టైఫాయిడ్ కూడా సోకుతోంది. పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి జ్వర పీడితుల తాకిడి పెరిగింది. ఆస్పత్రి ఓపీ (అవుట్ పేషెంట్)కి రోజూ 700 దాకా వచ్చేవారు. ఇటీవల జ్వర పీడితుల సంఖ్య పెరగడంతో ఓపీ 1200 మంది వస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నారు. సోమవారం 1,400కి చేరుతోందంటున్నారు. అడ్మిషన్ కూడా ఎక్కువ మంది అవుతున్నారు.



**ఆస్పత్రికి క్యూ**

ధర్మవరం ఏరియా ఆస్పత్రికి ధర్మవరం పట్టణం, రూరల్ ప్రాంతాలతోపాటు చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి, బత్తలపల్లి మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు కూడా వైద్యసేవల కోసం వస్తుంటారు. వారం రోజులుగా వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో ఆస్పత్రికి క్యూ కడుతున్నారు. కొందరికి టైఫాయిడ్ నిర్ధారణ అవుతోంది. రోజుకు 120-150 మంది రక్తపరీక్షలు చేయించుకుంటున్నారు. జ్వరాల వార్డు నిండిపోయింది.

**నివారణ చర్యలు శూన్యం**

జ్వరాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాంటివేవీ క్షేత్రస్థాయిలో తీసుకోవట్లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉంది. ప్రధాన రహదారుల్లో మాత్రమే చేస్తున్నారని పట్టణ వాసులు వాపోతున్నారు. మురుగు కాలువలను నిత్యం శుభ్రం చేయాలి. స్ప్రేయింగ్ కూడా చేయాలి. దానిని పూర్తిగా అటకెక్కించారన్న వాదనలున్నాయి. దీంతో జ్వరాల వ్యాప్తికి అడ్డుకట్ట పడట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వైరల్ ఫీవర్ వస్తే ఐదు రోజులపాటు ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికిగానీ, ఆరోగ్య ఉప కేంద్రానికిగానీ వెళ్లి చికిత్సలు చేయించుకోవాలి. దోమతెరలు వినియోగించాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. వేడిగా ఆహారం తీసుకోవాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు భుజించవద్దని వైద్యులు చెబుతున్నారు. జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని స్పష్టం చేస్తున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా వైరల్ ఫీవర్, దగ్గు, జలుబు, ఒళ్లునొప్పులు వంటి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాలి. పరిశుభ్రత పాటించాలి.




## తన ఆల్‌టైమ్ ఫేవరెట్ మూవీపై అఖిల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన లెనిన్ జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన లెనిన్ జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇటీవల రిలీజైన ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో సినిమాపై అంచనాలు కూడా పెరిగాయి. ఈ సందర్భంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న అఖిల్ తన సినీ ప్రయాణం, నటుడిగా తన ఆలోచనల గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నాడు. ముఖ్యంగా తనకు అత్యంత ఇష్టమైన సినిమా గురించి చేసిన అఖిల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జక్కన్న మైండ్‌లో ఏం ఉంది మామూలుగా అఖిల్ తన ఫేవరెట్ మూవీగా తన తండ్రి సినిమానో లేదంటే తన తాతయ్య గారి సినిమా పేరో చెప్తాడనుకుంటే రంగస్థలం సినిమా పేరు చెప్పి అందరికీ షాకిచ్చాడు. తన ఆల్‌టైమ్ ఫేవరెట్ మూవీ రంగస్థలం అని, దానికి గల కారణాన్ని కూడా వెల్లడించాడు అఖిల్. రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన ఆ సినిమా తనపై ఎంతో ప్రభావం చూపిందని వెల్లడించాడు. టాలీవుడ్‌ను తాను రంగస్థలం ముందు.. రంగస్థలం తర్వాత అనే విధంగా చూస్తానని చెప్పడం మరింత ఆసక్తిని కలిగించింది. కమర్షియల్ సినిమాల్లో కూడా కొత్త ఆలోచనలతో ప్రయోగాలు చేయవచ్చని తనకు నమ్మకం కలిగించిన సినిమా అదే అని అఖిల్ వివరించాడు. కమర్షియల్ హీరోకు వినికిడి సమస్య ఉన్న క్యారెక్టర్ రాయడం సాధారణ విషయం కాదని, అలాంటి పాత్రను కథలో ప్రధాన బలంగా మార్చడం డైరెక్టర్ సుకుమార్ ప్రతిభకు నిదర్శనమని అన్నాడు. సినిమాలో హీరోకు ఉన్న లోపం కారణంగానే ఎన్నో సమస్యలు ఎదురవడం, కొన్ని సందర్భాల్లో అతని వల్లే కథలో సంఘర్షణలు ఏర్పడడం వంటి అంశాలు తనను బాగా ఆకట్టుకున్నాయని చెప్పాడు. సాధారణంగా హీరో పాత్రను అన్ని విధాలా పర్ఫెక్ట్‌గా చూపించే ట్రెండ్‌కు భిన్నంగా, హీరో పాత్రకు సమస్యను పెట్టి దాన్ని ప్రేక్షకులు ఎంతగా ఆదరించారో చూసి ఆశ్చర్యపోయానని తెలిపాడు.



## సాయిపల్లవి-మృణాల్ ఠాకూర్ తీరు ఒకేలా!





టాలీవుడ్ లో వెలుగుతున్న ఇద్దరు అగ్రశ్రేణి నటీమణులు సాయిపల్లవి – మృణాల్ ఠాకూర్. ఒకరు సహజసిద్ధమైన నటనతో నేచురల్ స్టార్ గా గుర్తింపు పొందగా.. మరొకరు అభినయంతో –సీతారామం– తర్వాత గోల్డెన్ గర్ల్ గా ఎదిగారు టాలీవుడ్ లో వెలుగుతున్న ఇద్దరు అగ్రశ్రేణి నటీమణులు సాయిపల్లవి – మృణాల్ ఠాకూర్. ఒకరు సహజసిద్ధమైన నటనతో నేచురల్ స్టార్ గా గుర్తింపు పొందగా.. మరొకరు అభినయంతో –సీతారామం– తర్వాత గోల్డెన్ గర్ల్ గా ఎదిగారు. ఇద్దరి కెరీర్ గ్రాఫ్‌ను గమనిస్తే ఓ ఆసక్తికర పోలిక కనిపిస్తుంది. భారీ కమర్షియల్ ప్రాజెక్టుల వెనుక పరుగులు తీయ కుండా.. కథకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకోవడంలో ఒకే తరహా వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. తక్కువ సినిమాలతోనే గరిష్ట స్థాయి క్రేజ్ సంపాదించుకోవడం ఇద్దరి భామల ప్రత్యేకత. జక్కన్న మైండ్‌లో ఏం ఉంది సాయిపల్లవి కెరీర్ ప్రారంభం నుండి క్వాలిటీ ఓవర్ క్వాంటిటీ అనే సూత్రాన్ని పాటిస్తోంది. కేవలం పాత్రకు ప్రాముఖ్యత ఉన్న చిత్రాలను మాత్రమే ఒప్పుకోవడం, గ్లామర్ షోకు దూరంగా ఉంటూ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను అందుకోవడం ఆమెకే సాధ్యమైంది. సాయిపల్లవి బాటలోనే మృణాల్ ఠాకూర్ కూడా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. హిందీ నుండి తెలుగులోకి అడుగుపెట్టిన మృణాల్ కమర్షియల్ హీరోయిన్‌గా కాకుండా అభినయానికి ఆస్కారం ఉన్న పాత్రలకే మొదటి ప్రాధాన్యత ఇస్తోంది. ఇద్దరి ఎంపికలు చూస్తుంటే కథే సినిమాకు హీరో అనే నమ్మకం బలంగా కనిపిస్తోంది. అయితే ఈ తరహా సెలెక్టివ్ జర్నీలో ఓ సవాలు కూడా ఉంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి కేవలం కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలపైనే ఆధారపడటం వల్ల ఒక దశలో మార్కెట్ విజిబిలిటీ తగ్గే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాయిపల్లవి తన నటనతో ఈ రిస్క్‌ను అధిగమించగలిగింది. తాజాగా మృణాల్ ఠాకూర్ కూడా అదే తరహా నిలకడను ప్రదర్శించాల్సి ఉంది. ఎందుకంటే టాలీవుడ్ వంటి పరిశ్రమలో హీరోయిన్ల కెరీర్ చాలా వేగంగా మారుతుంటుంది. నిరంతరం ప్రేక్షకులకు కనిపిస్తూ ఉండటం అనేది కమర్షియల్ అవసరం. వీరిద్దరిలో ఉన్న మరో ఆసక్తికరమైన పోలిక.. ఇద్దరు కూడా నటన కు పీక్ స్థాయిలో ఇంపార్టెన్స్ ఇవ్వడం. మృణాల్ ఠాకూర్ –హాయ్ నాన్న– లో చూపిన హుందాతనం, సాయిపల్లవి ప్రతి చిత్రంలో చూపించే లీనత.. ఈ రెండూ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే బలమైన అంశాలుగా మారాయి. సోషల్ మీడియాలో కూడా ఇద్దరు గ్లామర్ కంటే చేస్తున్న పాత్రల వెనుక ఉన్న లోతును చర్చించడానికే ఇష్టపడతారు. ఈ పరిణతి వారిని సాధారణ హీరోయిన్ల కంటే భిన్నంగా నిలబెడుతోంది. ఒకవేళ ఇద్దరు భవిష్యత్తులో కూడా ఇదే సెలెక్టివిటీ ని కొనసాగిస్తే అది వారిని ఒక కల్ట్ ఇమేజ్ వైపు నడిపిస్తుంది. బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాలతో పాటు, చిన్న సినిమాల్లో కూడా బలమైన పాత్రలు చేయడం వల్ల వారి స్థానం మరింత పదిలం అవుతుంది. అయితే ఎంపికల సమయంలో కథల వైవిధ్యం విషయంలో ఇద్దరు మరింత జాగ్రత్తగా ఉండాలి. కేవలం ఎమోషనల్ పాత్రలకే పరిమితం కాకుండా వివిధ రకాల జోనర్లలో తమను తాము నిరూపించుకుంటే ఇద్దరు దశాబ్దాల పాటు ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయే నటీమణులుగా ఉంటారు. సాయిపల్లవి –మృణాల్ ఠాకూర్ ఎంచుకున్న ఈ మార్గం ఇండస్ట్రీకి ఓ కొత్త ఊపిరిని పోస్తోంది.


## ప్రతి రోజు ఒక కొత్త బ్రాండ్: కోట్లు కొల్లగొడుతున్న జాన్వీ!



బాలీవుడ్ స్టార్ కిడ్, టాలీవుడ్ క్రేజీ బ్యూటీ జాన్వీ కపూర్ వెండితెరపైనే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తిరుగులేని సామ్రాజ్యాన్ని సృష్టిస్తోంది.బాలీవుడ్ స్టార్ కిడ్, టాలీవుడ్ క్రేజీ బ్యూటీ జాన్వీ కపూర్ వెండితెరపైనే కాదు.. డిజిటల్ ప్రపంచంలోనూ తిరుగులేని సామ్రాజ్యాన్ని సృష్టిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 2.67 కోట్లకు పైగా ఉన్న ఫాలోయింగ్, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఉన్న క్రేజ్‌ను ఈ యంగ్ బ్యూటీ క్యాష్ చేసుకుంటున్న తీరు చూస్తుంటే ట్రేడ్ వర్గాలు సైతం ముక్కున వేలేసుకుంటున్నాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు ఈ భామతో ప్రమోషన్స్ చేయించేందుకు క్యూ కడుతుండటంతో జాన్వీ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల డిజిటల్ షోరూమ్‌లుగా మారిపోయాయి. జక్కన్న మైండ్‌లో ఏం ఉంది ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీ కపూర్ పోస్ట్ చేసే ఒక్కో ప్రమోషనల్ కంటెంట్ వెనుక భారీ వ్యాపార సామ్రాజ్యం దాగి ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం..ఈ భామ ఒకే ఒక్క యాడ్ పోస్ట్ లేదా రీల్ కోసం సుమారు 7 లక్షల నుండి 10 లక్షల వరకు వసూలు చేస్తోంది. అలాగే ఎక్స్ ఖాతాలో చేసే పోస్టులకు లక్షల్లో డిమాండ్ చేస్తోంది. కేవలం విడివిడి పోస్టులే కాకుండా ఒప్పో, లెన్స్‌కార్ట్, తుమి, హావెల్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలకు గంపగుత్తగా (బల్క్ ప్యాకేజీ) బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. ఏడాదికి 1 కోటి నుండి 2.5 కోట్ల వరకు ఒప్పందాలు కుదుర్చుకుంటోందని టాక్ వినిపిస్తోంది.నెలవారీ లెక్కలు చూస్తే.. జాన్వీ కపూర్ డిజిటల్ ఆదాయం ఊహకందని స్థాయిలో ఉంది. ఒక నెలలో కనీసం డజనుకు పైగా విభిన్న బ్రాండ్స్ (లైఫ్ స్టైల్, గ్యాడ్జెట్స్, బ్యూటీ ప్రొడక్ట్స్) ప్రకటనలను నిరంతరాయంగా పోస్ట్ చేస్తూనే ఉంటుంది. ఈ రకంగా చూసినా.. సోషల్ మీడియా వేదికల ద్వారానే ఈ బ్యూటీ నెలవారీ ఆదాయం 1.5 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ప్రస్తుతం డిజిటల్ మార్కెట్లో ఇంతటి క్రేజ్, కమర్షియల్ వాల్యూ ఉన్న మరో స్టార్ బ్యూటీ బాలీవుడ్‌లో లేరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కేవలం డిజిటల్ ప్రమోషన్స్ మాత్రమే కాకుండా... సినిమాల పరంగానూ జాన్వీ కపూర్ పారితోషికం ఆకాశాన్ని తాకుతోంది. హిందీ చిత్రసీమలో ఈ భామ నటిస్తున్న ఒక్కో సినిమాకు బడ్జెట్ – ప్రొడక్షన్ హౌస్‌ను బట్టి సుమారు 5 కోట్ల నుండి 6 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో పాటు గ్లామర్ పాత్రలకు సమన్యాయం చేస్తుండటంతో బాలీవుడ్ మేకర్స్ ఈ యంగ్ బ్యూటీ అడిగినంత ఇచ్చేందుకు వెనుకాడటం లేదు.

## సామ్ 'మా ఇంటి బంగారం' పై అఖిల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ వైరల్!






స్టార్ బ్యూటీ సమంత లీడ్ రోల్ లో నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన సూపర్ హిట్ సినిమానే మా ఇంటి బంగారం. మంచి బజ్ నడుమ వచ్చిన ఈ సినిమా ఈ ఏడాది టాలీవుడ్ లో మరో సూపర్ హిట్ గా నిలిచి అదరగొట్టింది. ఇలా సమంత మరోసారి సత్తా చాటగా లేటెస్ట్ గా ఈ సినిమా విషయంలో అక్కినేని యంగ్ హీరో అఖిల్ అక్కినేని లెనిన్ ప్రమోషన్స్ లో చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి.తను మా ఇంటి బంగారం సినిమా తన సినిమా ప్రమోషన్స్ మూలాన చూడలేకపోయానని ప్రస్తుతం ఈ టెన్సన్ లోనే ఉన్నాను కానీ ట్రైలర్ మాత్రం అద్భుతంగా అనిపించింది అని తెలిపాడు. అందులో ఉన్న ఒక వైబ్ తనకి బాగా నచ్చినట్టు తెలిపాడు. ఒక ఇంటి సెటప్ లో ఆ యాక్షన్ ఫ్యాక్టర్ ఎగ్జైటెడ్ గా అనిపించింది అని అఖిల్ చేసిన కామెంట్స్ ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక తన లెనిన్ ఈ జూలై 10న విడుదల అవుతున్న సంగతి తెలిసిందే.

## అఖిల్ లాంగ్ గ్యాప్.. అసలు కారణం ఇదే..!



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం వచ్చే వారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్లలో పాల్గొంటున్న అఖిల్.. 'ఏజెంట్' సినిమా తర్వాత నెక్స్ట్ చిత్రం కోసం ఇంత లాంగ్ గ్యాప్ తీసుకోవడానికి గల అసలు కారణాన్ని వెల్లడించాడు. ఈ ఆలస్యం వెనుక ఉన్న ఒక భయంకరమైన ప్రమాదం గురించి ఆయన షేర్ చేసిన విషయాలు ఇప్పుడు అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఈ గ్యాప్‌పై అఖిల్ స్పందిస్తూ.. "ఇది చాలా సుదీర్ఘమైన విరామం అని నాకు తెలుసు. ఇందులో సగం నా తప్పు ఉంటే, మిగిలిన సగం నా చేతుల్లో లేదు. 'ఏజెంట్' విడుదలైన నాలుగు నెలల తర్వాత నేను ఒక ప్రమాదానికి గురయ్యాను. బాత్‌రూమ్‌లో తడి నేలపై జారిపడటంతో అక్కడ ఉన్న గాజు ముక్క నా ఎడమ చేతికి బలంగా గుచ్చుకుంది. అది నా చేతిలోని నరాలను కట్ చేసింది. ఇది నన్ను మానసికంగా, శారీరకంగా తీవ్రంగా కుదిపేసిన ఒక ఊహించని ప్రమాదం" అని వివరించాడు.

## శోభిత మేడం గుడ్ న్యూస్ చెప్పేది ఎప్పుడో?

నాగ చైతన్య, శోభిత ధూళిపాల జంట గురించి సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఏదో ఒక వార్త వింటూనే ఉంటాం. ఆ మధ్య శోభిత సినిమాలకు బ్రేక్ తీసుకుందని, ఆమె గర్భం దాల్చడం వల్లే సినిమాలకు బ్రేక్ తీసుకుందనే వార్తలు జోరుగా వినిపించాయి. నాగ చైతన్య, శోభిత ధూళిపాల జంట గురించి సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఏదో ఒక వార్త వింటూనే ఉంటాం. ఆ మధ్య శోభిత సినిమాలకు బ్రేక్ తీసుకుందని, ఆమె గర్భం దాల్చడం వల్లే సినిమాలకు బ్రేక్ తీసుకుందనే వార్తలు జోరుగా వినిపించాయి. ఆ తర్వాత మీడియాలో వచ్చిన వార్తలు కేవలం పుకార్లే అని ఆమె టీం మెంబర్స్ కొందరు కొట్టి పారేశారు. నాగార్జున సైతం సమయం వచ్చినప్పుడు తప్పకుండా అందరికీ తెలియజేస్తాము, అంతా మంచి జరగాలని కోరుకుంటున్నాం అన్నట్లుగా చేసిన వ్యాఖ్యలు ఆ సమయంలో శోభిత ప్రెగ్నెంట్ అనే వార్తలకు బ్రేక్ వేసినట్లు అయ్యింది. నాగార్జున వ్యాఖ్యల తర్వాత మీడియాలో శోభిత గర్భం విషయమై చర్చ ఆగి పోయింది. అయితే ఇటీవల సమంత ప్రెగ్నెంట్ అనే విషయం అధికారికంగా బయటకు వచ్చినప్పటి నుంచి మళ్లీ శోభిత గర్భం విషయమై సోషల్ మీడియాలో కొందరు కామెంట్ చేస్తున్నారు. జక్కన్న మైండ్‌లో ఏం ఉంది శోభిత ప్రెగ్నెంట్ అంటూ వార్తలు.. సాధారణంగా పెళ్లి అయిన హీరోయిన్స్ ప్రెగ్నెన్సీ వార్తలు రెగ్యులర్‌గా వస్తూనే ఉంటాయి. ఏ హీరోయిన్ పెళ్లి అయినా ఏడాదికో రెండేళ్లకో ఆ హీరోయిన్ ప్రెగ్నెంట్ అయ్యిందంటూ అంటూ వార్తలు రావడం సహజం. చాలా మంది హీరోయిన్స్ ఆ వార్తలను కొట్టి పారేసిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని సార్లు మాత్రం ఆ వార్తలు నిజమే అన్నట్లుగా హీరోయిన్స్ బేబీ బంప్ ఫోటోలు షేర్ చేయడం మనం చూస్తూ ఉన్నాం. ఆ మధ్య సమంత గర్భవతి అంటూ వార్తలు వచ్చాయి. మా ఇంటి బంగారం సినిమా ప్రమోషన్ సమయంలో సమంత ప్రెగ్నెన్సీ గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. ఆ వార్తలను నిజమే అన్నట్లుగా సమంత తాజాగా తన బేబీ బంప్ ఫోటోను షేర్ చేయడంతో పాటు, జీవితంలో చాలా సంతోషకరమైన సందర్భం అన్నట్లుగా వ్యాఖ్యలు చేయడంతో అంతా కూడా ఆమెకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ జూనియర్ కోసం వెయిట్ చేస్తున్నామని మెసేజ్‌లు చేస్తున్నారు.నాగ చైతన్య, శోభిత జంటకు... ఇదే సమయంలో నాగ చైతన్య, శోభితలు ఎప్పుడు తల్లిదండ్రులు అవుతారా అని అక్కినేని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. గతంలోనే వార్తలు వచ్చినప్పటికీ వాటిని కొట్టి పారేశారు. ఇప్పుడు మరోసారి శోభిత ఎప్పుడు గుడ్ న్యూస్ చెబుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నటిగా శోభిత బిజీగా ఉన్నప్పటికీ అక్కినేని ఫ్యాన్స్ కోసం వారసుడిని ఇవ్వాలని అంతా కోరుకుంటున్నారు. చనిపోయిన అక్కినేని నాగేశ్వరరావు గారికి శోభిత జన్మనివ్వాలని సీనియర్ అక్కినేని ఫ్యాన్స్ కోరుతున్నారు.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197